జాతీయ స్ఫూర్తి
పక్షపత్రిక
2019, అక్టోబరు 16-31
వెల : రూ.15/-

రాజ్యాంగ మౌలిక స్వరూపాన్ని సంరక్షించుకోవాలి

సంక్షేమరాజ్య భావనకు నోబెల్ పట్టం

అమ్మయ్య! నా జాతి మేల్కొనే ఉంది..!

ఫెడరల్ స్ఫూర్తికి తిలోదకాలు

ఆర్టికల్ 370 సవరణతో కాశ్మీర్‌లో వచ్చే మార్పులేంటి ?

కశ్మీర్‌లో ఒక్కసారే పర్యటించిన గాంధీ.... ఏమన్నారు?

కశ్మీర్: హిందూ ముస్లింలను ఒక చోటికి చేరుస్తున్న కళా ప్రదర్శన

అవని తల్లికి అసలైన వారసులు

ఏ నిర్మూలన కావాలిప్పుడు?

బిజెపి నా హిందూమతాన్ని అవమానిస్తోంది

కార్ల్ మార్క్స్ చెప్పిన ఈ నాలుగు సిద్ధాంతాలకు నేటికీ తిరుగులేదు

జాతీయ స్ఫూర్తి పక్షపత్రిక

నిడదవోలు వెంకటేశ్వరరావు, ప్రచురణకర్త

2019 అక్టోబర్ 16-31 సంపుటి : 28 సంచిక : 2

డి.వి.వి.యస్. వర్మ, ప్రధాన సంపాదకులు

సంపాదక వర్గం

డా॥ బి. రమేష్‌చంద్రబాబు

కొప్పర్తి వెంకట రమణమూర్తి

డి. సోమసుందర్

మందలపర్తి కిషోర్

వెల : 15/- రూపాయలు

## ఈ సంచికలో...

4 సంక్షేమరాజ్య భావనకు నోబెల్ పట్టం - డి. పాపారావు

6 ఆకలి రాజ్యం - మాడభూషి శ్రీధర్

7 అమ్మయ్య! నా జాతి మేల్మోనే ఉంది! - మందలపర్తి కిషోర్

8 ఫెడరల్ స్ఫూర్తికి తిలోదకాలు

9 ఆర్టికల్ 370 సవరణతో జమ్మూ, కశ్మీర్‌లో వచ్చే మార్పులేంటి

10 కశ్మీర్‌లో ఒక్కసారే పర్యటించిన గాంధీ.. అప్పుడు ఆయన ఏమన్నారు? - కుమార్ ప్రశాంత్

12 కశ్మీర్ : హిందూ ముస్లింలను ఒక చోటికి చేరుస్తున్న కళాప్రదర్శన - సమీర్ యాసిర్

14 అవని తల్లికి అసలైన వారసులు - కలేకూరి ప్రసాద్

16 ఏ నిర్మూలన కావాలిప్పుడు ? - డా. ప్రసాదమూర్తి

17 బిజెపి నా హిందూమతాన్ని అవమానిస్తోంది - అవిజిత్ పాథక్

19-31 మార్క్స్ వ్యాసాలు

**చందా వివరాలు**

| | |
|---|---|
| విడి ప్రతి | రూ. 15-00 |
| చందా వివరాలు : | |
| 2 సంవత్సరాలకు | రూ. 500-00 |
| 1 సంవత్సరానికి | రూ. 300-00 |
| విద్యార్థులకు | రూ. 150-00 |

*చందా డి.డి. లేదా మనియార్డరు ద్వారానే పంపండి. చెక్కులు పంపరాదు*

Bank A/c No.3620 101 0000 380
Syndicate Bank, Eluru Main Branch
IFSC Code : SYNB0003620

పంపవలసిన చిరునామా :

**డా॥ బి. రమేష్‌చంద్రబాబు**

క్రాంతి నర్సింగ్ హోమ్

నన్నయ్య విగ్రహం వద్ద, మెయిన్‌రోడ్

తణుకు - 534 211

✆ 08819 222265, 93971 14495

# సంపాదకీయం

## రాజ్యాంగ మౌలిక స్వరూపాన్ని సంరక్షించుకోవాలి

**డి. సోమసుందర్**

జమ్మూ-కాశ్మీర్‌కు స్వయం ప్రతిపత్తిని హామీ ఇచ్చిన ఆర్టికల్ 370, 35ఎను రద్దు చేసి, రాష్ట్రాన్ని రెండు ముక్కలు చేసి, కేంద్ర పాలిత ప్రాంతం స్థాయికి కుదించిన బిజెపీ చర్యలు జాతీయ సమైక్యతకూ, సమగ్రతకూ తీరని హానిని కల్గిస్తాయి. అందరూ సృజనాత్మకంగా, కలిసికట్టుగా ఎదగడానికి వీలు కల్పించే సమాఖ్య చట్రానికి తూట్లు పొడిచాయి. ఒకే దేశం, ఒకే జాతి, ఒకే చట్టం పేరుతో జాతీయ స్థాయిలో భావోద్వేగాలు ప్రేరేపించి, భారతీయ సమాజాన్ని మొత్తంగా అతి తీవ్ర జాతీయవాదం వైపు, సైనికీకరణ మనస్తత్వం వైపు నడిపించడానికి ఆర్.ఎస్.ఎస్. సాగిస్తున్న ప్రయత్నంలో భాగంగానే జమ్మూ-కాశ్మీర్ విషయంలో బిజెపీ వైఖరిని అర్థం చేసుకోవాలి. బ్రిటీష్ ఇండియాలో రూపుదిద్దుకున్న జాతీయ ఆకాంక్షలతో గాని, జాతీయోద్యమ ఆదర్శాలతో గానీ, రాజ్యాంగ రూపకల్పనా ప్రక్రియతో గానీ ఏ మాత్రం సంబంధం లేని శక్తులు నేడు దేశాన్ని పాలిస్తున్నాయి. భిన్నత్వంలో ఏకత్వం భావనకు విరుద్ధంగా హిందూ రాష్ట్ర భావనను ప్రాచుర్యంలోకి తెచ్చిన సావర్కర్, హెగ్డేవార్, గోల్వాల్కర్ వంటివారు అప్పట్లో తమ వాదనలకు ప్రజల మద్దతును కూడగట్టుకోలేకపోయారు. గాంధీజీ, జవహర్‌లాల్ నెహ్రూ, డా॥బి.ఆర్. అంబేద్కర్, మౌలానా అబ్దుల్ కలామ్ ఆజాద్, సర్దార్ పటేల్, భగత్‌సింగ్, కమ్యూనిస్టులు అనేక అంశాలలో భిన్నాభిప్రాయాలు కల్గి వున్నప్పటికీ స్వాతంత్ర్యానంతర భారతదేశం ఒక ప్రజాస్వామ్య, లౌకిక, సామ్యవాద దేశంగా, ఆధునిక, నాగరిక, శాస్త్రీయ వివేచన కల సమాజంగా వుండాలని గట్టిగా భావించారు. మహమ్మదాలీజిన్నా, సావర్కర్ ప్రతిపాదించిన ద్విజాతి సిద్ధాంతాన్ని వారు గట్టిగా ఎదుర్కొన్నారు. బ్రిటీష్ పాలకుల విభజించి పాలించే కుటిల నీతిని ప్రతిఘటించారు. దేశవిభజన తప్పని పరిస్థితుల్లో జాతీయ నాయకత్వం విభజన గాయాలను త్వరితగతిన మాన్పే ప్రయత్నం చేసింది. హిందూ రాష్ట్ర నినాదాన్ని సమర్థంగా ఎదుర్కొన్నది.

స్వదేశీ సంస్థానాలలోని ప్రజా పోరాటాలను జాతీయోద్యమం గట్టిగా బలపర్చింది. సంస్థాన పాలకుల అభిప్రాయాల కంటే స్థానిక ప్రజల అభిప్రాయాలకే విలువ ఇవ్వాలన్న ఒక మౌలిక సూత్రానికి నాయకత్వం ప్రాధాన్యం ఇచ్చింది. 1935 భారత చట్టం, 1947 భారత స్వాతంత్ర్య చట్టం, రాజ్యాంగ పరిషత్తులో జరిగిన చర్చలు, రాజ్యాంగంలో పొందు పరిచిన అధికరణాలు నాటి పరిస్థితులను తేటతెల్లం చేస్తాయి. జాతీయోద్యమ నాయకత్వపు ఆలోచనలను, అవగాహనలను ఆ నేపథ్యంలో పరిశీలించాల్సి వుంటుంది.

అయితే అప్పట్లో సమాజాన్ని ఒప్పించడంలో విఫలమైన హిందూ రాష్ట్ర వాదులు అనంతర కాలంలో అలనాటి పరిస్థితులను, వాస్తవికతలను వక్రీకరిస్తూ, అసత్యాలతో, అర్ధ సత్యాలతో ఒక నిరంతర దుష్ప్రచారోద్యమాన్ని దశాబ్దాలుగా నిర్వహిస్తూ వచ్చారు. ముఖ్యంగా జమ్మూ-కాశ్మీర్ విషయంలో జాతీయోద్యమ నేతల వైఖరులను వక్రీకరించారు. నేతల మధ్య లేనిపోని వైరుధ్యాలను సృష్టించారు. వారిని నేరస్తులుగా చూపించారు. 370 అధికరణాన్ని బూచిగా చిత్రీకరించారు. కాశ్మీర్ భారత్‌లో అంతర్భాగంగా వుండటానికి 370 సావకాశం కల్పించిన వాస్తవాన్ని తల్లకిందులుగా ప్రచారం చేస్తూ వచ్చారు.

370ను రద్దు చేసి, వేలాది మంది రాజకీయ నేతలను నిర్బంధించి, వార్తా, ప్రసార సాధనాలను నియంత్రించి, కమ్యూనికేషన్ వ్యవస్థలను బందు చేసి, భారీగా సైనిక బలగాలను తరలించి కాశ్మీర్‌లో అంతా సవ్యంగానే వుందని ప్రభుత్వం చెబుతోంది. కానీ ప్రభుత్వ చర్యలు సమస్యను మరింత సంక్లిష్టం చేసింది. ప్రజల మనోగతాన్ని గౌరవించాలన్న జాతీయోద్యమ ఆదర్శాన్ని నేటి పాలకులు తుంగలోకి తొక్కారు. ప్రజాభిప్రాయాన్ని సైనిక బలం ద్వారా అణచడానికి చూస్తున్నారు.

ఇటువంటి చర్యల ద్వారా సమస్య పరిష్కారం కాదు. ఆ పేరుతో మరిన్ని భావోద్వేగాలను సృష్టించడం, నియంతృత్వాధి కారాలను కేంద్రీకృతం చేసుకోవడం, రాజ్యాంగ మౌలిక స్వరూపాన్ని మార్చడం లక్ష్యంగా పాలకులు ప్రయత్నాలు సాగిస్తున్నారు. భారతీయతకు విరుద్ధమైన హిందూ రాష్ట్ర వాదనను బలోపేతం చేయడానికి కృషిచేస్తున్నారు. ఇస్లామును, ఉగ్రవాదాన్ని, పాకిస్తాన్‌ను కాశ్మీరును, 370 అధికరణాన్ని ఒకే చట్టం భావనని కలగాపులగం చేసి సామాజిక మాధ్యమాల ద్వారా తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేస్తున్నారు. పాలకుల కుట్రలను, తప్పుడు ప్రచారాలను ఎదిరించి, భారత రాజ్యాంగ మౌలిక భావనలను రక్షించుకోవడం మనముందున్న తక్షణ కర్తవ్యం. ❑

## అశ్రు నివాళి



**నిరాడంబరుడు, నిత్య అధ్యయన శీలి, మార్క్సిస్టు సిద్ధాంత నిబద్ధత అంతకు మించి పాత కొత్తల మేలు కలయికగా దర్శనమిచ్చే రాఘవాచారి ఒక అపురూపమైన అరుదైన వ్యక్తి. ఆయన మరణానికి జాతీయ స్ఫూర్తి సంపాదక వర్గం అశ్రు నివాళి అర్పిస్తున్నది. రాఘవాచారి జీవిత భాగస్వామి, మాకు ఆత్మీయురాలు శ్రీమతి జ్యోత్స్నకి, కూతురు అనుపమకు మా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాము.**

## అక్షర చక్రవర్తికి అక్షరాంజలి

### జాతీయ స్ఫూర్తి ప్రత్యేక సంచిక

రెండు దశాబ్దాల కిందట ప్రారంభమైన జాతీయ స్ఫూర్తి పక్షపత్రిక తొలి సంచిక రాఘవాచారి గారి చేతుల మీదుగానే ఆవిష్కరించబడింది. చిరస్మరణీయమైన ఆయన స్ఫూర్తికీ, నిబద్ధతకూ అద్దం పట్టే రచనలతో జాతీయ స్ఫూర్తి నవంబరు సంచికను రూపొందిస్తున్నాం.

ఇప్పటికే వివిధ పత్రికలలో వచ్చిన వ్యాసాలతో పాటు ఇంకా అనేక మంది సన్నిహిత మిత్రుల రచనలతో రెట్టింపు పేజీలతో ఈ ప్రత్యేక సంచిక ఉంటుంది. చిన్న పత్రికలో చేస్తున్న ఈ ప్రయత్నానికి క్లుప్తంగా రచనలు పంపండి. నవంబరు 10 లోగా మీ రచనలు పంపండి.

రాఘవాచారి గారి స్ఫూర్తికి అక్షర రూపం ఇచ్చే ఈ మా ప్రయత్నానికి మీ సహాయ సహకారాలు అందించండి.

# సంక్షేమరాజ్య భావనకు నోబెల్ పట్టం



**డి. పాపారావు**
ఆర్థిక రంగ విశ్లేషకులు

**విశ్లేషణ**

ప్రపంచ పేదరిక సమస్యను పరిష్కరించే మార్గాలను అన్వేషించడంలో వినూత్న పద్ధతుల్లో ఆలోచించిన ముగ్గురు ఆర్థిక చింతనాపరులకు ఈ ఏడాది అర్థశాస్త్రంలో నోబెల్ బహుమతి ప్రకటించడం ముదావహం. ప్రపంచ పేదరిక సమస్య తాలూకు ప్రశ్నలను మరింత సరళమైన, నిర్దిష్టమైన రూపంలోకి వడకట్టి, తద్వారా పరిష్కారాన్ని సూచించే కృషిని చేశారనేది వారికి వస్తున్న ప్రశంస. భారత్ వంటి అభివృద్ధి చెందుతోన్న దేశాల ప్రభుత్వాలు, తమ పరిమితవనరులను చీకట్లో రాయి విసిరినట్లు గుడ్డిగా తమకు తోచిన విధంగా పేదరిక నిర్మూలన కార్యక్రమాలకు ఖర్చు పెట్టడం కాకుండా, ఆ నిధులను కచ్చితమైన ఫలితాలను ఇచ్చే పద్ధతుల పైన వాడవచ్చు అని వీరి భావన. నిత్యజీవితంలో విద్య, వైద్యం వంటి రంగాల్లో తలెత్తుతున్న సమస్యల పరిష్కారం కోసం మనం అంతకుముందర ఆలోచించి ఉండని పరిష్కారాలను వారు ముందుకు తెచ్చారు.

2019 సంవత్సరానికి ఆర్థిక రంగంలో నోబెల్ బహుమతిని ముగ్గురు ఆచార్యులు కలిసి గెలుచుకున్నారు. వారిలో భారత సంతతి అమెరికా జాతీయుడైన అభిజిత్ బెనర్జీ, ఆయన సహచరి ఎస్తర్ డఫ్లో, హార్వర్డ్ విశ్వ విద్యాలయ ఆచార్యుడు మైకెల్ క్రెమర్లు ఉన్నారు. అమర్త్యసేన్ తరువాత ఆర్థిక రంగంలో నోబెల్‌బహుమతి ని గెలుచుకున్న రెండవభారతీయునిగా అభిజిత్ నిలిచారు. అయితే ప్రపంచ పేదరిక సమస్య పరిష్కారానికి అభిజిత్ సూచించిన పరిష్కారాలు మాత్రమే సరైన ఫలితాలను ఇస్తాయని భావించ పనిలేదు. ఆర్థిక అసమానత్వంపై విస్తృత పరిశోధనలు చేసిన ప్రఖ్యాత ఆర్థికవేత్త థామస్ పికెట్టీ సూచించిన పరిష్కార మార్గాలు కూడా జోడిస్తే వ్యవస్థాగత మౌలిక మార్పులకు దోహదపడతాయి.

అర్థిక శాస్త్రంలో నోబెల్ బహుమతి పొందిన ఈ ముగ్గురి పరిశోధనలూ ప్రధానంగా ప్రపంచంలో పేదరికాన్ని నిర్మూలించేందుకు ఎంతగానో ఉపయోగపడతాయని నోబెల్ అకాడమీ పేర్కొంది. ప్రపంచ పేదరిక సమస్యను అర్థం చేసుకుని, పరిష్కరించేందుకు గాను వీరు ఆ సమస్య తాలూకు ప్రశ్నలను మరింత సరళమైన, నిర్దిష్టమైన రూపంలోకి వడకట్టి, తద్వారా ఆ సమస్యకు పరిష్కారాన్ని సూచించే కృషిని చేశారనేది వారికి వస్తున్న ప్రశంస. అలాగే పేదరికానికి సంబంధించి ఈ సరళీకరించిన, నిర్దిష్ట ప్రశ్నలకు ప్రయోగాత్మక పద్ధతిలో పరిష్కారాలు కనుగొనేందుకు వీరు ప్రయత్నించారు. ఈ పరిశోధనల కోసం తమ విశ్వవిద్యాలయం ఎమ్.ఐ.టి లో వీరు 'పేదరిక (పరిష్కార) కార్యాచరణ ప్రయోగశాల'ను ఒకదానిని 2000 సంవత్సరం ప్రాంతంలో ఏర్పరిచారు. ఈ పరిశోధనలో వీరు తాము ఎంచుకున్న ఒక పేదరిక అంశానికి లేదా సమస్యకు పరిష్కార పద్ధతిని రెండు బృందాల ద్వారా పరీక్షించేవారు. వాటిలో ఒక బృందంపై ఈ పరిష్కార పద్ధతిని అమలు జరిపేవారు. రెండవ బృందాన్ని ఈ పద్ధతి నుంచి మినహాయించే వారు. అంటే ఇది ఒక రకంగా ఫార్మా రంగంలోని క్లినికల్ ట్రయిల్స్ ప్రయోగ పద్ధతి వంటిది. తద్వారా వారు ఒక నిర్దిష్ట పేదరిక సమస్యకు తాము సూచిస్తోన్న పరిష్కార పద్ధతి సామర్థ్యాన్నీ పరీక్షించేవారు.

ఈ విధంగా కనుగొన్న పరిష్కారం ద్వారా నిధుల కొరత అధికంగా ఉన్న భారత్ వంటి అభివృద్ధి చెందుతోన్న దేశాల ప్రభుత్వాలు, తమ పరిమిత వనరులను చీకట్లో రాయి విసిరినట్లు గుడ్డిగా తమకు తోచిన విధంగా పేదరిక నిర్మూలన కార్యక్రమాలకు ఖర్చు పెట్టడం కాకుండా, ఆ నిధులను కచ్చితమైన ఫలితాలను ఇచ్చే పద్ధతులపైన వాడవచ్చు అనేది ఈ ఆర్థికవేత్తల వాదన. ఈ విధంగా, ఎమ్.ఐ.టి.లోని ప్రయోగశాలలో అభిజిత్, ఎస్తర్లు జరిపిన పరిశోధనలూ, ఈ పరిశోధనా పద్ధతిని మైకెల్ క్రెమర్, కెన్యా దేశంలోని పాఠ శాలలలో పరీక్షించడం ద్వారానూ కనుగొన్న పేదరిక నిర్మూలన పద్ధతులు కొన్నింటిని పరిశీలిద్దాం. ఈ ప్రయోగ పద్ధతులను వారు ప్రధానంగా విద్య, వైద్య రంగాలలో కేంద్రీకరించారు. విద్యారంగంలో ఈ పద్ధతులను అనుసరించడం ద్వారా భారత్, ఆఫ్రికాలలో 60 లక్షలమంది పిల్లలకు మెరుగైన విద్య ద్వారా ప్రయోజనం చేకూరిందనేది ఒక అంచనా. కాగా, వీరి సూత్రీకరణల ప్రకారంగా పాఠశాలల విద్యార్థులకు మరిన్ని పాఠ్య పుస్తకాలూ, ఉచిత భోజనాలను అందించడం కంటే, చదువులో వెనుకబడిన విద్యార్థులకు నిర్దిష్టంగా అదనపు ట్యూషన్

వంటి సాయం అందించడం ద్వారా, మరింత మెరుగైన ఫలితాలు వచ్చాయి. అలాగే, పిల్లలకు వారి కడుపులోని నులిపురుగులను నిర్మూలించే ఔషధాన్ని ఇవ్వడం అనే అతి చిన్న చర్య ద్వారా వారి ఆరోగ్యంలో మెరుగుదలా, వారి పాఠశాల హాజరును మెరుగుపరచడం సాధ్యం అయ్యాయని వారు చెబుతారు. ఇక తరగతి గదిలో ఒక ఉపాధ్యాయుడు బోధించాల్సిన విద్యార్థుల సంఖ్య, ఒక పరిమితిని మించితే దాని వలన విద్యా బోధన నాణ్యత పడిపోతుందనేది మనం నేటి వరకు నమ్ముతోన్న అంశం. కాగా, ఇది పూర్తిగా సరైనది కాకపోవచ్చుననీ, ఈ విధంగా విద్యార్థి ఉపాధ్యాయ నిష్పత్తిని తగ్గించే యత్నం కంటే, విద్యార్థులకు మంచి గ్రేడ్లు వచ్చేలా బోధించగలిగితేనే, ఆ ఉపాధ్యాయునికి బోధనా కాంట్రాక్టును పాఠశాల పొడిగించే విధానం మంచిదనేది ఈ నోబెల్ పరిశోధకుల తర్కం.

స్థూలంగా, "పరిమిత" వనరులు వున్న భారత్ వంటి దేశాలకు పేదరిక నిర్మూలనకుగాను ఈ లక్ష్యిత పరిష్కార చర్యలు మంచిదనేది ఈ ఆర్థికవేత్తల తర్కం. కాగా, నేడు ప్రపంచ వ్యాప్తంగా అనేక దేశాలలో అంతర్జాతీయ ద్రవ్య సంస్థల ఆదేశిత పొదుపు చర్యలు అమలు జరుగుతోన్న విషయం తెలిసిందే. ఈ చర్యలలో భాగంగా వివిధ ప్రభుత్వాలు తమ తమ దేశాల విదేశీ అప్పులను తీర్చగలిగేటందుకు గాను తమ దేశాలలోని సామాన్య ప్రజలకు కల్పించే సంక్షేమ పథకాలపై కోతలు పెడుతున్నాయి. అలాగే, వ్యయాల తగ్గింపులో భాగంగా ప్రభుత్వ ఉద్యోగుల సంఖ్యను కుదించడం, కొత్తగా ఉద్యోగులను భర్తీ చేయకపోవడం, ఉద్యోగుల పింఛను సదుపాయం వంటి వాటిని కుదించడం వంటి చర్యలకు పాల్పడుతున్నాయి. ఇటువంటి చర్యలకు పెట్టిన పేరే "సంస్కరణలు". కాగా, ఈ సంస్కరణలలో ఆయా దేశాల కార్పొరేట్లకూ, ధనవంతులకూ ఇచ్చే రాయితీలను పెంచుతూ పోవడం కూడా అంతర్భాగమే. ఉదాహరణకు, మన దేశంలో కూడా కార్పొరేట్లపై విధించే పన్నును తగ్గించడం... మరోవైపు, ద్రవ్య లోటును తగ్గించుకొనే పేరిట వంట గ్యాస్ సబ్సిడీ, కిరోసిన్ సబ్సిడీ, పంపిణీ వ్యవస్థ సబ్సిడీలు వంటి వాటిపై కోతలు వేస్తూ పోవడం వంటివన్నీ తెలిసినవే.

ఇటువంటి విధానాల ఫలితంగా నేడు మన దేశంలో ఆర్థిక సంక్షోభం నెలకొని వుంది. ఈ విషయాన్ని అభిజిత్ కూడా అనేక దఫాలు ప్రస్తావించారు. అలాగే గత వారం అమెరికాలోని బ్రౌన్ విశ్వవిద్యాలయంలో తాను చేసిన ఓ.పి జిందాల్ ఉపన్యాసంలో, భారతదేశంలో నెలకొన్న ఆర్థిక సంక్షోభ స్థితికి సూచించిన పరిష్కారాలలో ముఖ్యమైనవి ప్రజల చేతిలోకి డబ్బు చేరేలా చూడటం, జాతీయ ఉపాధి హామీ పథకంలో వేతనాలు పెంచడం, రైతులకు గిట్టుబాటు ధరను ఇవ్వడం వంటివన్నీ ఉన్నాయి. కాగా, ఈ పరిష్కారాలు అన్నీ ప్రస్తుతం అమలు జరుగుతోన్న పొదుపు చర్యలకు భిన్నంగా, ప్రభుత్వం మరింతగా వ్యయాలు పెంచడంతో కూడినవి. అయితే అభిజిత్‌తో పాటు ఈ ఏడాది ఆర్థికరంగంలో నోబెల్ గ్రహీతలకు ఆ బహుమతిని తెచ్చిపెట్టింది, నేడాయన భారత ఆర్థిక వ్యవస్థలోని మాంద్య స్థితి పరిష్కారానికి సూచించిన పై స్థూల ఆర్థిక పరిష్కారాలు కాదు. అభిజిత్, ఆయన సహచరులు తమ దృష్టిని ప్రధానంగా ఆర్థిక రంగం తాలూకు.. అందులోనూ ముఖ్యంగా విద్య, వైద్యరంగాలలోని సూక్ష్మ అంశాలపై కేంద్రీకరించారు. అత్యంత కేంద్ర స్థాయిలో తరగతి గదిలో విద్యార్థులు నేర్చుకునే సమస్యలూ, వారి రోజువారీ పాఠశాల హాజరు, విద్యార్థుల విద్యార్జనపై వారి ఆరోగ్య ప్రభావం వంటి ప్రజల జీవితాల తాలూకు నిర్దిష్ట, అత్యంత సూక్ష్మ అంశాలపై వారు తమ పరిశోధనలను కేంద్రీకరించారు. తద్వారా, నిత్య జీవితంలో విద్య, వైద్యం వంటి రంగాల్లో తలెత్తుతున్న సమస్యలను పరిష్కరించేందుకుగాను మనం అంతకుముందు ఎన్నడూ ఆలోచించి ఉండని పరిష్కారాలను వారు ముందుకు తెచ్చారు. కాగా, ప్రభుత్వాల ఆర్థిక విధానాలూ, అవి ఆర్థిక వ్యవస్థ యాజమాన్యంలో అనుసరించే భిన్నమార్గాలు అనేవి అభిజిత్ ఆయన సహచరుల దృష్టిని కేంద్రీకరించిన సూక్ష్మస్థాయి అంశాలను ప్రభావితం చేసేవిగా ఉండగలవు. ఉదాహరణకు ప్రభుత్వ విధానాలు మారి, కార్పొరేట్లకు, ధనికులకు పన్ను రాయితీలూ సబ్సిడీలు ఇవ్వడం కాకుండా వారిపై మరింతగా పన్నులు విధించడం వంటిది చేయగలిగితే ప్రభుత్వ ఖజానాకు అదనపు నిధులు సమకూరుతాయి.

ఆ స్థితిలో, నిధుల కొరత పరిస్థితుల్లో ఆమలు జరప వీలైనవిగా అభిజిత్, ఆయన సహచరులు చెప్పిన సూక్ష్మస్థాయి విధానాలకే ప్రభుత్వాలు పరిమితం కానవసరం ఉండదు. ప్రస్తుతం నెలకొన్న ఆర్థిక మాంద్యానికి, అభిజిత్ సూచించిన పైన పేర్కొన్న పరిష్కార మార్గాల అమలుకు కావల్సిన వనరులు ప్రభుత్వం వద్ద ఉంటాయి. కాబట్టి అభిజిత్‌కు నోబెల్‌బహుమతిని తెచ్చిపెట్టిన విద్యా, వైద్య రంగాలలోని ప్రభావవంతమైన సూక్ష్మస్థాయి కార్యాచరణతో పాటుగా ప్రఖ్యాత ఆర్థికవేత్త, ప్రపంచంలోని ఆర్థిక అసమానతలపై విస్తృత పరిశోధనలు చేసిన థామస్ పికెట్టీ వంటి వారు సూచించిన, వ్యవస్థాగతంగానే మౌలిక మార్పులను తెచ్చే విధానాలు కూడా నేటి తక్షణ అవసరం.. ఆగత్యం కూడా..!! ❑

# ఆకలి రాజ్యం

**మాడభూషి శ్రీధర్**
బెన్నెట్ యూనివర్సిటీ ప్రొఫెసర్
కేంద్ర సమాచార మాజీ కమిషనర్



ఛీ! ఏమిటీ.. మీరు ప్రపంచంలో ఆకలి లెక్కలు వేసి మాకు చెబుతారా? త్రివేణి సంగమ పవిత్ర భూమి, నాలుగు వేదములు పుట్టిన భూమి, గీతామృతమును పంచిన భూమి, పంచశీల బోధించిన భూమి... ఆకలి రాజ్యమా. ఏం లెక్కలివి? ఎవరి లెక్కలివి? అయిదేళ్లు నిండని పాపలకు మేం సరిగా అన్నం పెట్టడం లేదా? ఆర్నెల్ల పసికందుల నుంచి రెండేళ్ల పాపలలో 84 శాతం మందికి మేం కనీస తిండి కూడా పెట్టడం లేదా? అద్భుతంగా వెలిగిపోతున్న మా దేశాన్ని అంతర్జాతీయంగా పరువు దీయడానికేనా ఈ మాటలు. మొత్తం 119 దేశాలలో మా దేశం 102 రెండవ స్థానంలో ఉందన్నా ఫరవాలేదు. దక్షిణాఫ్రికా కన్నా హీనంగా ఉన్నామన్నా సర్దుకుంటాం. కానీ బాంగ్లాదేశ్ కన్నా, చిన్ని చిట్టి దేశం నేపాల్ కన్నా మేం తీసిపోయామా? 2015లో మా దేశానికి కింద పాకిస్తాన్ ఉందని మీరే చెప్పారు. మాకు 93వ ర్యాంకు ఇచ్చి పాక్‌కు 106 ఇచ్చారు. అది న్యాయం. ఆకలి మంటల్లో మేం ఎక్కడున్నా సరే పాకిస్తాన్ కన్నా ముందున్నాం అని అప్పటి నుంచి మేం సంతోషిస్తూనే ఉన్నాం. ఇప్పుడు మాకు ఆ అపరిమితానందం కరువు చేస్తారా? మా దాయాది, మా శత్రువు, వారి పేరు చెబితే చాలు మాకు ఓట్లు కుప్పలు తెప్పలుగా పడతాయి. మా వాళ్లే ప్రతిసారీ గెలిచినా సరే మేం వారితో క్రికెట్ ఆడనే ఆడం. అటువంటి పాకిస్తాన్ కన్నా మా దేశాన్ని 8 అడుగుల కిందకు తోస్తారా? 2016 లో మాకు 97, పాక్‌కు107 ఇచ్చారు, 2017లో మాకు 100, మా దాయాదికి 106 ఇచ్చారు. ఫరవాలేదు. చివరకు పోయినేడాది 2018లో పాక్‌కు106 ఇచ్చి మాకు 103వ ర్యాంకు ఇచ్చారు. అదే కరెక్టు. ఈసారి మా ర్యాంక్‌ను 103 నుంచి 102 చేశారు. మాకది పెద్ద ప్రమోషనే కదా అని సంతోషిద్దామనుకున్నాం. కాని పాక్‌కు 93వ ర్యాంక్ ఇచ్చి మమ్మల్ని అవమానించారు. కనీసం పాక్ కన్నా ముందున్నాం అని చెప్పినా మిమ్మల్ని క్షమించే వాళ్లం. మీరు టెర్రరిస్టుల్లో కలిసిపోయారా లేక మా దేశంలో అర్బన్ నక్సలైట్లు మీమీద ఏమైనా మత్తుమందు జల్లారా? మాకు చెత్త ర్యాంకు ఇస్తే ఇచ్చారని సరిపెట్టుకుందామనుకుంటే, బంగ్లాదేశ్‌ను తెగ మెచ్చుకుంటారా? బాలబాలికలకు పోషకాహారం ఇచ్చే బుద్ధి వారికి ఎక్కువగా ఉందా, పరిశుభ్రత కల్పించడంలో, ప్రచారంలో, ఆరోగ్యం రక్షించడంలో బంగ్లాదేశ్‌కు అన్ని మార్కులు, పక్కనే ఉన్న మా దేశానికి మరీ అంత తక్కువ మార్కులు? వేస్తారా?

మాకన్నా చిన్న దేశం నేపాల్‌ను అంతగా పొగిడారు. సరే అది మా హిందూ రాజ్యం గనుక ఫరవాలేదు. కాని మరీ అన్ని ప్రశంసలా? 2000 సంవత్సరం తరువాత నేపాల్ వారు ఆకలి మీద యుద్ధంలో చాలా ముందుకు వెళ్లారంటారా? మేమేమీ చేయలేదంటారు. మా దేశంలో చాలా మంది పిల్లలు పురిట్లోనే పోయారంటారా? పిల్లలకు ఎత్తుకు తగిన బరువు, వయసుకు సరిపోయే ఎత్తు లేదంటారా? ఏం మా పిల్లల్ని ఎప్పుడైనా ఎత్తుకున్నారా? లేకపోతే మీకెలా తెలుస్తుందో? మేం స్వచ్ఛభారత్ ద్వారా పారిశుద్ధ్యం చాటడం లేదా, బహిర్భూమిలో విసర్జన మీద యుద్ధం ప్రకటించి, బోలెడు మరుగుదొడ్లు నిర్మిస్తున్నాం కదా, అంతర్జాలం డాష్‌బోర్డులో క్లిక్ కొడితే చాలు ఏ ఊళ్లో ఎన్ని మరుగుదొడ్లు కట్టామో లెక్క చూసుకునే అద్భుతమైన, అదిరిపోయే పారదర్శక పాలనా విధానాన్ని తీసుకువచ్చాం. మేం ఎంత పారదర్శకంగా ఉన్నామంటే అసలు మాకు ఆర్టీఐతో పనే లేదు తెలుసా. అందుకే మేం మా సమాచార కమిషనర్లకు అంత పెద్ద ర్యాంకు ఎందుకని తగ్గించి పడేశాం. మీరు మా ఆకలి ర్యాంకు పెంచుతారా? మా దేశంలో ప్రతి శుక్రవారం వందల సినిమాలు విడుదల అవుతాయి. వాటిలో బోలెడు సినిమాలు వందల కోట్లు సంపాయిస్తున్నాయి. అయినా మాదేశంలో ఆర్థిక మాంద్యం ఉందని తప్పుడు ప్రచారం చేసి ఫేక్ న్యూస్ పంచుతున్నారని మేం జనానికి నచ్చజెప్పుకుంటున్నాం. కొత్తగా ఈ ఆకలి అంకెల పంచాయతీ ఏమిటి? ఆకలి మంటలు పెరిగాయనే అనుకుందాం. దానికి మేమా కారణం. పర్యావరణ వాతావరణ మార్పులు, భూమి వేడెక్కడం కావచ్చు, పాక్ – చైనా సమష్టి కుట్ర కావచ్చు. కమ్యూనిస్టులు తెచ్చిన విదేశీ హస్తం కావచ్చు. పటేల్‌ను పక్కన బెట్టి ప్రధాని అయిన నెహ్రూ రాజకీయ కుట్ర కావచ్చు. మేం మాత్రం కాదు. మహారాష్ట్ర, హరియాణాలో ఎన్నికల సమయంలో ఇదేదో కొత్త కుట్ర అయి ఉంటుంది. మీ ఆకలి లెక్కలు, మా డబ్బుల లెక్కలు చెప్పి మా జనాన్ని భయపెట్టాలని చూడకండి. 370 మాకు చాలు. ఆకలట ఆకలి. ❑

## అమ్మయ్య!

# నా జాతి మేల్కొనే ఉంది..!

మందలపర్తి కిషోర్



కొన్నాళ్ళు నిద్రపోయి ఉండొచ్చు –
మరి కొన్నాళ్ళు మూర్ఛపోయి ఉండొచ్చు –
ఇంకొన్నాళ్ళు మైకంలో మునిగిపోయి ఉండొచ్చు –
కొన్నాళ్ళు తమకంతో తడిసిపోయి ఉండొచ్చు –
లేదంటే, పరధ్యానంలో పడిపోయి ఉండొచ్చు –
ఏదో పారవశ్యంలో తనను తాను మర్చిపోయి ఉండొచ్చు –
కానీ నా జాతి కన్ను మూయలేదు !
ఆలస్యంగానైనా మేలుకొంది, అదే పదివేలు!!
అమ్మయ్య! నా జాతి మేల్కొనే వుంది!!

✧ ✧ ✧

మొత్తం కూడితే వాళ్ళు 49 మంది మాత్రమే!
అటునుంచి ఇటు లెక్కపెట్టినా అంతే –
ఇటునుంచి అటు లెక్కపెట్టినా అంతే –
అర్ధశతకానికి ఒకటి తక్కువే – అయితే ఏం?
వయస్సు మళ్ళిన వాళ్లేమో కానీ,
ఎముకలు కుళ్ళిన వాళ్ళు మాత్రం కారు !
నెత్తురుమండే వాళ్ళేమో కానీ,
కత్తులు విసిరే వాళ్ళు మాత్రం కారు!!
కళలతోనూ, కలలతోనూ,
కలాలతోనూ కాయితాలతోనూ కలిసి బతికే వాళ్ళు –
కానీ వాళ్ళ కళ్ళు ఎన్నడూ మూసుకుపోలేదు!
వాళ్ళ కాళ్ళు నేలను విడిచి సాము చెయ్యనూ లేదు!!

✧ ✧ ✧

నా జాతి ఇంకా బతికే ఉందని రుజువు చెయ్యడానికే
వాళ్లలో కొందరు
ఆ మహాబధిరుడి ముందు శంఖారావం చేశారు !
నిద్ర నటిస్తున్నవాణ్ణి లేపేందుకు
కొందరు ఘంటారావం చేశారు –
కుండబద్దలు కొట్టి మరీ నిజం మాట్లాడారు !
అది కూడా
ఏ మసక చాటు నుంచో, మబ్బు మాటు నుంచో కాదు –
బహిరంగంగానే చేశారా పని !!
ఆరిన గుండెల్లో ఆరని ప్రమిదలు వెలిగించారు –
పడమటి పొద్దున ఉదయపు వెలుగులు వెదజల్లారు !!
అదే రాజద్రోహం అయితే జాతి మొత్తం ఆ పనే చేద్దాం పదండి!!

✧ ✧ ✧

ఓజస్సూ, తేజస్సూ ఉడిగిపోయి,
చెట్టు కింద ప్రాక్టీసు చెట్టెక్కిపోయి,
పాపం, ఆ పెద్దమనిషికి పొద్దుపోవడం లేదట !
తేరగా తిన్న సొమ్ము అరిగి చావడం లేదట !!
వాడి జుట్టూ వీడి జుట్టూ ముడిపెట్టి,
దారేపోయే దానయ్యలపై తొడగొట్టి,
తల బొప్పి కట్టించుకున్నా,
తలనొప్పి తెప్పించుకున్నా, బుద్ధి మాత్రం రాలేదట !
సామెత చెప్పినట్టు, కట్టె ఒంకర పొయ్యే తీర్చాలి !!
పనీ పాటూ లేని పెద్దమనిషి,
జాతికి మేల్కొలుపులు పాడుతున్న వైతాళికుల జోలికి పోయాడు–
భగ్గుమన్న జనాగ్రహంలో కాళ్ళూ చేతులూ కాల్చుకున్నాడు!
తోక ముడిచి, కేసు మడిచి, పరారైపోయాడు !
వినగలిగితే మహా బధిరుడికి ఇక్కడో పాఠం ఉంది!
నిద్ర నటించడం మానేస్తే నిజం కళ్లెదుటే కనిపిస్తుంది !!
కాదని మొండికెత్తితే కాలం మొండి కత్తి ఉండనే ఉంది !! ❑

# ఫెడరల్ స్ఫూర్తికి తిలోదకాలు

కశ్మీర్ స్వయం ప్రతిపత్తిని, రాష్ట్ర హోదాను రద్దు చేసి, రెండు కేంద్ర పాలిత ప్రాంతాలుగా విభజించాలని కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయానికి సహజంగానే కొంత మద్దతు, అనేకానేక అభ్యంతరాలూ వ్యక్తమైనాయి. సభ్య సమాజం, ప్రజల తరఫున మాట్లాడే మేధావి వర్గం, ప్రతిపక్ష నాయకులు లేవనెత్తిన అభ్యంతరాలు ఇప్పటికే బహుళ ప్రచారంలో ఉన్నాయి. వాటిని పునరుద్ఘాటించవలసిన అవసరం లేదు. కశ్మీర్‌పై నిర్ణయాన్ని ప్రతిపక్షాల దృష్టి నుంచి చూడడం అంటే రాజ్యాంగ ప్రమాణాలను ఖాతరు చేయకపోవడాన్ని, ఏ నిర్ణయమైనా విస్తృతమైన సంప్రదింపుల తరవాతే తీసుకోవాలన్న నియమాన్ని ఉల్లంఘించడాన్ని, జరిగే అన్యాయం గురించి ఆలోచించడమే. ప్రశ్నించడమే. అధికార పక్షం అన్యాయంగానే కశ్మీర్ ప్రత్యేక ప్రతిపత్తిని రద్దు చేసింది.

ఇలాంటి నిర్ణయాన్ని ప్రభుత్వం సమర్థించుకోవడం అసాధారణమైంది ఏమీ కాదు. కశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తి రద్దు చేయడం అంటే ఆ ప్రాంతాన్ని దేశంలో సమైక్యం చేయడం, ఆ ప్రాంత ప్రజల సంక్షేమం కోసం పాటు పడడమేనని కేంద్రం సమర్థించుకోవడం మామూలే. కశ్మీర్ భారత్‌కు భిన్నం కాదు అని చెప్పాలంటే 370వ అధికరణం, దానితో సంబంధం ఉన్న 35-ఎ అధికరణం అడ్డంకిగా ఉన్నాయన్నది ప్రభుత్వ వాదన. కేంద్రంలోనూ, రాష్ట్రాలలోనూ పటిష్ఠమైన ప్రభుత్వాలు ఉండాలంటే కశ్మీర్‌ను "సమైక్యం" చేయాల్సిందేనని కేంద్ర ప్రభుత్వం, కేంద్ర నిర్ణయాన్ని సమర్థిస్తున్న వారూ భావిస్తున్నారు.

కశ్మీర్‌ను సమైక్యం చేయడం అని అధికార పక్షం చెప్పే మాట వెనక తాము వాదనే చెల్లాలన్న ధోరణి ఉంది. ఇందులో దేశ సమైక్యత, ఆ ప్రాంత అభివృద్ధి, కశ్మీరీ ప్రజల సంక్షేమం అన్న మాటలు సహజంగానే ఇమిడి ఉంటాయి. కేంద్ర ప్రభుత్వం చేస్తున్న ఈ వాదన, అనేక రాజకీయ పక్షాలు ఈ వాదనను సమర్థించడం సవ్యమైన రాజకీయ చైతన్యం కొరవడడానికి నిదర్శనం. ప్రభుత్వ వాదనలు నిజానికి ఊకదంపుడు మాటలే తప్ప వాస్తవం మీద ఆధారపడ్డవి కాదు. ఇది అభివృద్ధికరమైన జాతీయవాదానికి అనుగుణమైంది కాదు. దేశంలోని అనేక ప్రాంతాల మధ్య ఉద్రిక్తతలు కొనసాగుతూనే ఉన్నాయి. ఈ ఉద్రిక్తతలు రాష్ట్రాల మధ్య కూడా కనిపిస్తాయి. ఈ ప్రాంతాలు, రాష్ట్రాలూ భారత ఫెడరల్ వ్యవస్థలో భాగమే. ఫెడరల్ విధానంలో సామరస్యం కొనసాగితేనే రాష్ట్రాలకు విలువ ఉంటుంది. ఈ ప్రాంతాలలో నివసించే వారిలో వ్యధ ఉంటే సామరస్యం సాధ్యం కాదు.

అధికారం కేంద్రీకృతం అయితే సంక్షేమం సాధ్యం కాదు. ఒక వేళ అదే సాధ్యమయ్యేటట్టయితే మన దేశంలో గ్రామాల నుంచి పట్టణాలకు వలసలే ఉండేవి కావు. ప్రజలకు నాణ్యమైన జీవనాన్ని అందించే సామర్థ్యం మన పట్టణాలకు లేదు. గ్రామీణ ప్రాంతాలను నిర్లక్ష్యం చేసినందువల్ల, ప్రాంతీయ అభివృద్ధి మీద శ్రద్ధ తీసుకోనందువల్ల వలసలు తప్పడం లేదు. దీనివల్ల వేలాది గ్రామాల్లో నాగరికత ధ్వంసం అయింది. ఉత్తరాఖండ్ దీనికి మంచి ఉదాహరణ. అక్కడి గ్రామాలు ఇప్పుడు దయ్యాల కొంపలుగా మారిపోయాయి. నిర్జనంగా తయారయ్యాయి. మనుషుల, జీవావరణ మనుగడకు ఏ మేరకు ఉపయోగపడుతుందన్న అంశం మీదే ఒక ప్రాంతం విలువ ఆధారపడి ఉంటుంది.

కశ్మీర్ స్వయం ప్రతిపత్తి రద్దు చేయడం వల్ల మరిన్ని అవకాశాలు కల్పించగలమని కేంద్ర ప్రభుత్వం చెప్తోంది. ఆర్థిక లావాదేవీలకు ఎక్కువ అవకాశం ఉండే పట్టణ ప్రాంతాలలో ప్రభుత్వం అందరికీ సమాన అవకాశాలు కల్పించలేదన్నది వాస్తవం. దీనివల్ల అవకాశం కోల్పోయేది ప్రధానంగా సామాన్యులే. అనుభవాన్ని బట్టి చూస్తే పట్టణాలు అత్యంత సంపన్నులకే అవకాశాలు కల్పిస్తున్నాయి. అవి ఆధునిక అగ్రహారాలుగా మారిపోతున్నాయి. అట్టడుగు వర్గాల వారికి అవకాశమే ఉండడం లేదు. కేంద్ర ప్రభుత్వ వాదన అన్యాయాన్ని ఎదిరించే వర్గాల వారి వాణిని కప్పి పుచ్చుతాయి. కశ్మీర్ లోయలో ఈ పరిస్థితి

☞ మిగతా 13వ పేజీలో

# 'ఆర్టికల్ 370 సవరణ'తో జమ్మూ, కశ్మీర్‌లో వచ్చే మార్పులేంటి

ఆర్టికల్ 370కు సవరణ చేస్తామని అమిత్ షా రాజ్యసభలో ప్రకటించిన తర్వాత దీనికి రాష్ట్రపతి ఆమోదముద్ర వేసి గెజిట్ జారీ చేశారు.

**ఈ బిల్లులో ఏముందంటే...**

- ఆర్టికల్ 370కు సవరణ చేయడంతో పాటు ఆర్టికల్ 35ఎని రద్దు చేశారు. దీంతో రాష్ట్రంలో శాశ్వత నివాసులను గుర్తిస్తారు.
- ప్రభుత్వం ఆర్టికల్ 370కి సవరణ చేయడంతో పాటు రాష్ట్ర పునర్నిర్మాణం గురించి ప్రస్తావించింది.
- జమ్ము కాశ్మీర్ ఇక రాష్ట్రంగా ఉండదని చెప్పారు.
- జమ్ము-కశ్మీర్ స్థానంలో ఇక రెండు కేంద్ర పాలిత ప్రాంతాలు ఉంటాయి.
- ఒకదాని పేరు జమ్ము-కశ్మీర్, ఇంకోదాని పేరు లద్దాఖ్
- రెండు కేంద్ర పాలిత ప్రాంతాలూ లెఫ్టినెంట్ గవర్నర్ పరిధిలోకి వస్తాయి.
- జమ్ము, కశ్మీర్లో అసెంబ్లీ ఉంటుంది. లద్ధాఖ్‌లో అసెంబ్లీ ఉండదు.
- ఆర్టికల్ 370లో ఒక విభాగం మాత్రం అలాగే ఉంచారు. దాని ప్రకారం రాష్ట్రపతి ఏదైనా మార్పులకు ఆదేశాలు జారీ చేయవచ్చు.
- అక్కడ భద్రత స్థితి, సీమాంతర ఉగ్రవాదం వల్లే వాటికి కేంద్ర పాలిత ప్రాంతాల హోదా ఇచ్చామని హోంమంత్రి అమిత్ షా చెప్పారు.

## ఆర్టికల్ 370 సవరణతో ఏం జరుగుతుంది?

భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 370 జమ్ము-కశ్మీర్‌కు ప్రత్యేక రాష్ట్ర హోదాను కల్పించింది.

**దీని వెనుక చరిత్రలోకి వెళ్తే..**

- 1947లో భారత్-పాకిస్తాన్ విభజన జరిగినపుడు జమ్ము-కశ్మీర్ రాజు హరిసింగ్ స్వతంత్రంగా ఉండాలని భావించారు. కానీ, తర్వాత ఆయన కొన్ని షరతులతో భారత్‌లో విలీనం అయ్యేందుకు సమ్మతించారు.
- ఆ తర్వాత భారత రాజ్యాంగంలో ఆర్టికల్ 370 నిబంధనలు ఏర్పరిచారు. దీని ప్రకారం జమ్ము-కశ్మీర్‌కు ప్రత్యేక హక్కులు కల్పించారు. కానీ, అప్పట్లో ఆ రాష్ట్రానికి ప్రత్యేక రాజ్యాంగం ఉండాలని డిమాండ్ చేశారు.
- 1951లో ఆ రాష్ట్రాన్ని రాజ్యాంగ సభ నుంచి వేరుగా పిలవడానికి అనుమతించారు.
- 1956 నవంబర్‌లో రాష్ట్ర రాజ్యాంగం ఏర్పాటు పూర్తయింది. 1957 జనవరి 26న రాష్ట్రానికి ప్రత్యేక రాజ్యాంగం అమల్లోకి వచ్చింది.
- రాజ్యాంగంలోని ఆర్టికల్ 370 నిజానికి కేంద్రం నుంచి జమ్ము-కశ్మీర్ సంబంధాలకు రూపురేఖలుగా ఉంటుంది.
- ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ, షేక్ మహమ్మద్ అబ్దుల్లా ఐదు నెలలు చర్చించిన తర్వాత ఆర్టికల్ 370ని రాజ్యాంగంలో జోడించారు.
- ఆర్టికల్ 370 నిబంధనల ప్రకారం రక్షణ, విదేశాంగ విధానం, కమ్యూనికేషన్ అంశాల మినహా వేరే ఏ అంశానికి సంబంధించి చట్టం చేయాలన్నా, అమలు చేయాలన్నా కేంద్రం రాష్ట్ర ప్రభుత్వం అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది.
- ఈ ప్రత్యేక హోదా కారణంగా జమ్ము-కశ్మీర్ రాష్ట్రంపై రాజ్యాంగంలోని ఆర్టికల్ 356 అమలు చేయడం కుదరదు. దానివల్ల భారత రాష్ట్రపతి దగ్గర రాష్ట్ర రాజ్యాంగాన్ని రద్దు చేసే హక్కు ఉండదు.
- ఆర్టికల్ 370 కారణంగా జమ్ము-కశ్మీర్‌కు ప్రత్యేక జెండా కూడా ఉంటుంది. దాంతో పాటు జమ్ము-కశ్మీర్ అసెంబ్లీ కాలపరిమితి ఆరేళ్లు ఉంటుంది.
- ఆర్టికల్ 370 వల్ల భారత రాష్ట్రపతి జమ్ము-కశ్మీర్‌లో ఆర్థిక అత్యవసర పరిస్థితి విధించడం సాధ్యం కాదు.

☞ మిగతా 18వ పేజీలో

# కశ్మీర్‌లో ఒక్కసారే పర్యటించిన గాంధీ..
# అప్పుడు ఆయన ఏమన్నారు?- అభిప్రాయం

**కుమార్ ప్రశాంత్**

స్వాతంత్ర్యం ఇంటి గుమ్మం దగ్గరే ఉంది. కానీ, తలుపు ఇంకా తెరుచుకోలేదు. రాచరిక రాజ్యాలను విలీనం చేసే ప్రణాళికలో జవహర్‌లాల్ నెహ్రూ, సర్దార్ పటేల్ తలమునకలై ఉన్నారు.

రాచరిక రాజ్యాలు రకరకాల ఎత్తులు వేస్తున్నాయి. భారత దేశంలో విలీనం అయ్యేందుకు అనేక షరతులు పెడుతున్నాయి.

అదే సమయంలో, సామ్రాజ్యవాద శక్తులు కొత్త కుట్రలు పన్నుతున్నాయి. స్వాతంత్ర్యం అంచున ఉన్న భారత్‌పై ఓ కన్నేసి ఉంచడంతో పాటు, ఆసియా కీలక రాజకీయాల్లో జోక్యం చేసుకునేందుకు ఈ పరిస్థితులను ఒక అవకాశంగా మలచుకోవాలని ఆ శక్తులు చూస్తున్నాయి.

అప్పటికే పాకిస్తాన్ ఏర్పాటు ప్రక్రియ కొనసాగుతోంది. కశ్మీర్ కూడా సామ్రాజ్యవాదుల వ్యూహానికి అనుకూలంగా ఉంది. 1881 నుంచి సామ్రాజ్యవాదులు ఆ 'సాలిగూడు'ను అల్లుతూ వస్తున్నారు. అందుకు సంబంధించిన పత్రాలు తాజాగా బయటపడ్డాయి.

కశ్మీర్ కీలకంగా మారింది. రాచరిక పాలనకు వ్యతిరేకంగా పోరాడుతున్న యువ నాయకుడు షేక్ మొహమ్మద్ అబ్దుల్లాకు కాంగ్రెస్ మద్దతు ఉంది. ఆయన జవహర్‌లాల్‌కు సన్నిహితుడిగా ఉండేవారు.

స్థానికంగా నిరసన కార్యక్రమం చేపట్టిన ఆయనను మహారాజా హరిసింగ్ జైలులో పెట్టారు. దాంతో, ఆగ్రహం వ్యక్తం చేసిన జవహర్‌లాల్ నెహ్రూ ప్రతీకార చర్యలు చేపట్టేందుకు కశ్మీర్ వెళ్లారు. ఆయనను కూడా తన సొంత గెస్ట్ హౌజ్‌లోనే గృహ నిర్బంధం చేశారు. ఆ పరిణామంతో మహారాజాకు ఇక్కట్లు మొదలయ్యాయి.

కశ్మీర్ ఎటు వెళ్లాలి? అన్న సందిగ్ధత కారణంగా లోయలో అనిశ్చితపరిస్థితులు నెలకొన్నాయి. ఆ పరిస్థితులను చక్కదిద్దేందుకు ఎవరు బాధ్యత వహిస్తారు? బాపూజీని అక్కడికి వెళ్ళాలని కోరితే ఎలా ఉంటుంది? అని లార్డ్ మౌంట్‌బాటన్ ప్రతిపాదించారు.

అంతకుముందు మహాత్మా గాంధీ ఎన్నడూ కశ్మీర్‌లో అడుగుపెట్టలేదు. వెళ్లాలని అనుకున్న ప్రతిసారీ ఏదో ఒక కారణంతో ఆ పర్యటన విరమించుకోవాల్సి వచ్చేది.

జిన్నా కూడా కశ్మీర్‌ను కేవలం ఒక్కసారే సందర్శించారు. అప్పుడు, టొమాటోలు, కోడిగుడ్లతో ఆయనకు స్వాగతం లభించింది. భూస్వాములకు, యువరాజులకు జిన్నా అనుకూలంగా వ్యవహరిస్తున్నారన్న అభిప్రాయం ప్రజల్లో బలంగా ఉండేది.

గాంధీజీ కశ్మీర్ వెళ్లాలని మౌంట్‌బాటన్ ప్రతిపాదనలు చేశారు. గాంధీజీకి అప్పుడు 77 ఏళ్లు.

భారత భౌగోళిక స్వరూప మూలాలు బలంగా లేకపోతే, రాచరిక రాజ్యాలు భవిష్యత్తులో కొరకరాని కొయ్యలా తయారవుతాయని ఆయనకు తెలుసు. కశ్మీర్ వెళ్లేందుకు గాంధీ సరే అన్నారు.

"మీరు ఈ వయసులో అంత క్లిష్టమైన ప్రయాణం చేయడం అవసరమా? మీరు మహారాజాకు లేఖ పంపితే సరిపోతుంది కదా" అని ఒకరు గాంధీకి సలహా ఇచ్చారు. గాంధీ ఆయన కళ్లలోకి కళ్లు పెట్టి చూస్తూ... "మీ లాజిక్ ప్రకారం, బంగ్లాదేశ్‌లోని నోవాఖలీకి కూడా నేను వెళ్లాల్సిన అవసరం లేదు. అక్కడికి కూడా నేను ఉత్తరం పంపేవాడిని కదా. కానీ మిత్రమా, అలా చేస్తే పనులు జరగవు" అని అన్నారు.

ఆ ప్రయాణం చాలా క్లిష్టమైనది. కానీ, దేశ ప్రయోజనాల దృష్ట్యా, గాంధీజీ తన ప్రయాణాన్ని పెద్ద ఇబ్బందిగా భావించలేదు.

స్వాతంత్ర్యానికి కేవలం 14 రోజుల ముందు మహాత్మా గాంధీ తొలిసారి రావల్పిండి మీదుగా కశ్మీర్ చేరుకున్నారు. కశ్మీర్‌కు ఆయన చివరి ప్రయాణం కూడా అదే. ఆ ప్రయాణం ప్రారంభానికి ముందు, 1947 జులై 29న ప్రార్థనా సమావేశం సందర్భంగా తాను కశ్మీర్‌కు వెళ్తున్నానని గాంధీ చెప్పారు.

"భారత్‌లోనే ఉండేలా కశ్మీర్‌ను ఒప్పించేందుకు నేను అక్కడికి వెళ్లడం లేదు. ఆ నిర్ణయం తీసుకోవాల్సింది కశ్మీర్

ప్రజలు.. అది నేను లేదా మహారాజా తీసుకునే నిర్ణయం కాదు. కశ్మీర్‌కు మహారాజా ఉన్నారు, పౌరులు ఉన్నారు. ఒకవేళ రేపు రాజు మరణించినా, ఆ ప్రజలు అక్కడే ఉంటారు. కశ్మీర్ భవితవ్యాన్ని నిర్ణయించేది వాళ్లే" అని మహాత్మా గాంధీ అన్నారు.

1947 ఆగస్టు 1న గాంధీ కశ్మీర్ చేరుకున్నారు. అప్పట్లో ఎన్నడూ లేనంతగా భారీ మొత్తంలో ప్రజలు కశ్మీర్ లోయలో ఒక్కచోటకు చేరుకున్నారు. జీలం నది మీద ఉన్న వంతెన మీద కూర్చునేందుకు కూడా చోటు దొరకనంత మంది వచ్చారు.

ఆ వంతెన మీది నుంచి శ్రీనగర్‌లోకి గాంధీ కారు వెళ్లలేక పోయింది. దాంతో, ఆయన కారు దిగి, బోటులో నదిని దాటి శ్రీనగర్‌కు వెళ్లారు. సుదూర ప్రాంతాల నుంచి తరలివచ్చిన కశ్మీరీలు, గాంధీ పర్యటన పట్ల ఎంతో సంతృప్తి వ్యక్తం చేశారు.

ఆ సమయంలో షేక్ అబ్దుల్లా జైలులో ఉన్నారు. గాంధీ కోసం బేగం అక్బర్ జెహాన్ అబ్దుల్లా కూడా మర్యాదపూర్వక విందు ఏర్పాటు చేశారు. మహారాజా కూడా తన రాజభవనంలో విందు ఇచ్చారు.

మహారాజా హరి సింగ్, మహారాణీ తారా దేవీ, రాకుమారుడు కరణ్ సింగ్ రాజభవనం నుంచి బయటకు వచ్చి గాంధీకి స్వాగతం పలికారు. దేశీయ వ్యవహారాల గురించి అక్కడ వారు ఏం చర్చించారో తెలియలేదు. కానీ, బేగం అక్బర్ జెహాన్ విందు కార్యక్రమంలో మాత్రం బాపూజీ బాహాటంగానే మాట్లాడారు.

"ఈ రాచరిక రాజ్యానికి నిజమైన పాలకులు ప్రజలే. వాళ్లు పాకిస్తాన్‌తో వెళ్లాలని అనుకుంటే, వారిని ఏ శక్తీ అడ్డుకోలేదు. కానీ, ప్రజల అభిప్రాయాలను మీరు ఎలా సేకరిస్తారు? ప్రజాభిప్రాయాన్ని సేకరించేందుకు అనువైన పరిస్థితులను నెలకొల్పాలి. ప్రజలు స్వేచ్ఛగా తమ అభిప్రాయాలను వెల్లడించేలా చూడాలి. వారిపై దాడి చేసి, వారి గ్రామాలను, ఇళ్లను తగలబెట్టడం ద్వారా మీరు వారి అంగీకారాన్ని పొందలేరు.

తాము ముస్లింలం అయినప్పటికీ భారతదేశంలోనే ఉండాలని కోరుకుంటున్నామని ఇక్కడి ప్రజలు చెబితే, వారిని ఏ శక్తీ ఆపలేదు. పాకిస్తానీయులు ఈ ప్రాంతంలోకి ప్రవేశిస్తే, వారు తమ పాలనను స్థాపించకుండా ఇక్కడి ప్రజలు అడ్డుకోవాలి. పాకిస్తాన్‌ను అడ్డుకోలేకపోతే, అప్పుడు వారు నిందల నుంచి తప్పించుకోలేరు" అని గాంధీ అన్నారు.

భారత విధానాన్ని గాంధీ మరోసారి స్పష్టం చేశారు: "కాంగ్రెస్ ఎప్పుడూ రాచరికానికి వ్యతిరేకమే. అది ఇంగ్లండ్‌లో కావచ్చు, ఇక్కడ కావచ్చు. షేక్ అబ్దుల్లా ప్రజాస్వామ్యం గురించి మాట్లాడుతుంటారు, దాని కోసం పోరాడుతున్నారు. మేము ఆయనకు అండగా ఉన్నాం. ఆయన జైలు నుంచి బయటకు రావాలి. ఆ తర్వాత ఎలా ముందుకెళ్లాలన్న దానిపై ఆయనతో చర్చలు జరుపుతాం. కశ్మీర్ ఎటు వెళ్లాలో ఇక్కడి ప్రజలు నిర్ణయిస్తారు" అని గాంధీజీ అన్నారు.

"ఇక్కడి ప్రజలు" అని చెప్పినప్పుడు గాంధీ తన ఉద్దేశాన్ని కూడా స్పష్టం చేశారు: "ఇక్కడి ప్రజలు" అంటే, నేను ముస్లింలు, హిందువులు, కశ్మీరీ పండిట్స్, డోగ్రాలు, సిక్కులను ఉద్దేశించి అన్నాను" అని ఆయన వివరించారు.

కశ్మీర్ విషయంలో భారత్ తన పాత్ర గురించి అధికారికంగా చేసిన ప్రకటన అది. అప్పటికి స్వతంత్ర భారత ప్రభుత్వం ఇంకా అధికారికంగా ఏర్పడనందున గాంధీ ప్రభుత్వ ప్రతినిధి కాదు.

ఆయన భారత స్వాతంత్ర్య పోరాట విలువలకు పితామహుడు. స్వతంత్ర భారతదేశం పాత్రకు అత్యంత అధికారిక, విశ్వసనీయమైన ప్రతినిధి అన్న వాస్తవాన్ని ఎవరూ కాదనలేరు.

గాంధీ పర్యటన కశ్మీరీలలో విశ్వాసాన్ని ఎంతగానో పెంచింది. షేక్ అబ్దుల్లా జైలు నుంచి విడుదల, కశ్మీర్ భారత దేశంతోనే ఉంటుందని ఆయన ప్రకటించడం, కశ్మీరీ ముస్లింలను పాకిస్తాన్ నుంచి వేరుచేసేందుకు ఆయన ప్రయత్నించడంలో ఆ విషయం స్పష్టంగా కనిపించింది.

జవహర్‌లాల్ నెహ్రూ –సర్దార్ పటేల్– షేక్ అబ్దుల్లాలు గాంధీ ప్రశంసలు పొందారు. అలా చరిత్రలో ఓ అధ్యాయం లిఖితమైంది. ప్రస్తుత ప్రభుత్వం దానిని చెరిపివేసేందుకు ప్రయత్నిస్తోంది. ఆనాటి ప్రక్రియలో ఎలాంటి పాత్రా పోషించని వారు, ఇవాళ దానిని తుడిచేసేందుకు తాము అర్హులమని చెప్పుకొంటున్నారు.

ఇక్కడ మనం గుర్తుంచుకోవాల్సిన విషయం మరొకటి ఉంది. పాకిస్తాన్ తన సైనిక బలంతో కశ్మీర్‌ను స్వాధీనం చేసుకోవాలని ప్రయత్నించినప్పుడు, భారత్ తిప్పికొట్టింది. అప్పుడు, మహాత్మా గాంధీ భారత సైనిక చర్యకు మద్దతు ఇచ్చారని మరచిపోకూడదు. ❑

**బీబీసీ కోసం, 25 సెప్టెంబర్ 2019**

# కశ్మీర్: హిందూ ముస్లింలను ఒక చోటికి చేరుస్తున్న కళా ప్రదర్శన

సమీర్ యాసిర్
బీబీసీ ప్రతినిధి

భారత పాలనలోని కశ్మీర్ నుంచి దాదాపు 28 ఏళ్ల క్రితం వేర్వేరు ప్రాంతాలకు పారిపోయిన కశ్మీరీ హిందూ కళాకారులను మళ్లీ తమ ముస్లిం సహచరులతో కలిపింది ఓ ఆర్ట్ ఎగ్జిబిషన్.

ఇరు సముదాయాల వారికీ ఇదొక గొప్ప భావోద్వేగాల కలయికగా నిలిచింది.

అవ్‌తార్ క్రిష్ణ రైనా ఒక కశ్మీరీ హిందూ. లేదా కశ్మీరీ పండిట్. 1990లో ఇక్కడి నుంచి వెళ్లిపోయిన తర్వాత మళ్లీ ఎప్పుడూ తన స్వస్థలానికి రాలేదు.

తమ సముదాయంలోని తోటి కళాకారులు, శిల్పులతో కలిసి ఈ ప్రత్యేకమైన కళా ప్రదర్శన కోసం వచ్చారు. అలా ఆయన మూడు దశాబ్దాల తర్వాత తొలిసారి తన ఇంటికి వచ్చారు. అక్కడే ఆయన తన ఒకనాటి సహచర ముస్లిం కళాకారులను కలుసుకున్నారు.

ఈ ప్రాంతంలో భారత పాలనను వ్యతిరేకిస్తూ హింసాత్మక తిరుగుబాటు ప్రారంభించిన ముస్లిం మిలిటెంట్ల భయంతో 1990 దశకంలో ఈ రాష్ట్రాన్ని వదిలి వెళ్లిన దాదాపు 2 లక్షల మంది కశ్మీరీ పండిట్లలో రైనా ఒకరు.

"ఒక రోజు ఇంటికి వచ్చినపుడు వేర్పాటువాద మిలిటెంట్లు ఇంటి బయట అంటించిన ఒక పోస్టర్ చూశాను. రాత్రుళ్లలో మమ్మల్ని చూసి మొరుగుతున్న నీ కుక్కకు విషం పెట్టి చంపమని వారు అందులో రాశారు" అని ఆయన చెప్పారు.

చాలామంది హిందువులు పారిపోయిన ఆ "భయంకరమైన నెల"లో తమ వాళ్లందరినీ చంపేస్తారేమోనని ఆయన భావించారు. "నాతో పాటూ ఏదీ తీసుకెళ్లలేదు, కట్టుబట్టలతో వెళ్లిపోయాను" అని రైనా చెప్పారు. ఇప్పుడు ఆయన మధ్యప్రదేశ్‌లో ఒక పెయింటర్‌గా పనిచేస్తున్నారు. "నేనెప్పటికీ తిరిగి రాలేకపోయేవాణ్ని, అలా రావాలనే ఆసక్తి కూడా నాలో లేకుండా పోయింది" అన్నారు.

రైనా ఈ కళా ప్రదర్శనకు వచ్చినపుడు, మహమ్మద్ అష్రఫ్ అనే ఒక పాత స్నేహితుడు ఆయన్ను పలకరించారు.

ఈ మాజీ ఉన్నతాధికారి తనతో పాటూ ఒక పెయింటింగ్ వెంట తెచ్చారు. 2014 వరదలతో కశ్మీర్ అతలాకుతలం అయినప్పుడు అష్రఫ్ తన ఇంటి నుంచి ఆ ఒక్క పెయింటింగ్‌ను మాత్రమే కాపాడుకోగలిగానని ఆయన చెప్పారు.

"1985లో ఈ బొమ్మ నువ్వే వేశావ్, గుర్తుందా? ఈ పెయింటింగ్ మాత్రమే తీసుకుని నేను ఇంటి నుంచి బయటపడ్డా" అని రైనాతో అష్రఫ్ అన్నారు. చెక్కిళ్లపై నుంచి కన్నీళ్లు కారుతుండగా రైనా ఆ పెయింటింగ్‌ను తన చేతుల్లోకి తీసుకున్నారు.

ఈ ప్రదర్శనను ఏర్పాటు చేసిన నిర్వాహకులు సరిగ్గా ఇలాంటి అనుబంధాల పునరుద్ధరణనే ఆశించారు.

"కళ అనేది క్లిష్టమైన అంశాల గురించి సంభాషించే భాష" అంటారు కశ్మీరీ ముస్లిం కళల ప్రచారకర్త ముజ్తాబా రిజ్వీ. ఆయన తన సమకాలీన కళాకారుడు వీర్ మున్షీతో కలిసి ఈ ప్రదర్శనను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు.

"చాలా అడ్డుగోడలు, దురభిప్రాయాలు తొలగిపోయాయి. సామాజిక సంబంధాల మెరుగుదలకు కళ ఓ మాధ్యమంలా పని చేయగలుగుతుంది."

రాష్ట్ర రాజధాని శ్రీనగర్‌లో ఒకప్పుడు సిల్క్ ఫ్యాక్టరీగా పేరు పొందిన వందేళ్ల నాటి పాత భవనం శిథిలాల్లో దీన్ని ఏర్పాటు చేశారు. ఏడు రోజుల పాటు జరిగే ఈ ప్రదర్శన ఆదివారం (జూన్ 24) ముగిసింది.

"సమాజాల మధ్య వంతెనలు నిర్మించే శక్తి కళకు మాత్రమే ఉంది" అంటారు కళా చరిత్రకారుడు రతన్ పరిమూ. ఆయనో కశ్మీరీ హిందూ.

తాత్కాలికంగా ఏర్పాటు చేసిన గ్యాలరీ అంతా కళాకృతులతో

నిండిపోయింది. ఆ ప్రాంతంలో జరిగిన సంఘర్షణల్లో ప్రజలు అనుభవించిన బాధల లోతులను అవి కళ్లకు కడుతున్నాయి.

ఒక బొమ్మలో ఒంటిపై ఏ అచ్ఛాదనా లేని ఒక వ్యక్తి, తనను ముళ్ల కంచె గట్టిగా చుట్టేసినా, చిరునవ్వులు చిందిస్తుంటాడు. అతడు కశ్మీరీ హిందూ అని తను ధరించిన జంధ్యంతో మాత్రమే తెలుస్తుంది.

"హిందువైనా, ముస్లిమైనా కాశ్మీరులో సామాన్యుడి కథ ఇదే" అంటారు కళాకారుడు చుసుల్ మహాల్దర్. 'స్ట్రగులింగ్ స్మైల్' అనే పేరుతో ఆయన తన సెల్ఫ్ పోర్ట్రెయిట్ చిత్రించారు.

మున్షీ ఏర్పాటు చేసిన ఒక కళాకృతి తిరుగుతున్న వస్తువులతో ఉంటుంది. "మనం సంఘర్షణలో ఉన్నప్పుడు మాత్రమే దాన్నుంచి బయటపడడం ఎంత కష్టంగా ఉంటుందో తెలుస్తుంది అన్న అంశాన్ని ఇది చూపిస్తుంది" అని మున్షీ చెప్పారు. ఆయన కూడా ఒకప్పుడు ఇక్కడి నుంచి వెళ్లిపోయినవారే.

ప్రదర్శనా స్థలం మధ్యలో ఉన్న తిరగబడిన పడవ ఇటీవల కాలంలో కశ్మీర్ ఎలా తలకిందులైందో చూపిస్తుందని కళాకారులు చెబుతారు.

"పడవ దిగువ వైపు కూడా చూడడం చాలా ముఖ్యం". అదెప్పుడూ నీళ్లలోనే ఉంటుంది అంటారు మున్షీ.

ప్రదర్శన ప్రవేశ మార్గంలో కశ్మీరీ ముస్లిం కళాకారుడు మమూన్ అహ్మద్ వేసిన 30 అడుగుల (9.1 మీటర్ల) పొడవున్న ఒక పెయింటింగ్ ఉంటుంది. సిరాతో వేసిన ఈ చిత్రంలో మనకు ఎముకలు, చెట్లు కనిపిస్తాయి. అది చావుబతుకులను సూచిస్తుంది.

"జాగ్రత్తగా నడువు" అనే అర్థం వచ్చే ఉర్దూ పదం 'రువేదా' స్ఫూర్తితో ఈ పెయింటింగ్ వేశారు.

"ఇది కశ్మీర్‌లోని సంఘర్షణ కథను చెబుతుంది, దీని పక్క నుంచి నడుస్తుంటే, అది హిందూ, ముస్లింల మధ్య ఖాళీని కలిపే వంతెనలా అనిపిస్తుంది" అని ఆయన అంటారు.

బీజేపీ, పీడీపీ సంకీర్ణ ప్రభుత్వం కుప్పకూలి, ప్రస్తుతం ఇక్కడ రాజకీయ అస్థిరత ఉన్నప్పటికీ, దీన్ని చూడాలనే ఆసక్తితో వందలాది మంది ఈ ప్రదర్శనను చూడడానికి వస్తున్నారు.

"ఇది గుండెను పిండేస్తోంది. కానీ ఒక భిన్నమైన అనుభవం" అని స్థానిక కాలేజీలో ఆర్ట్ స్టూడెంట్ సాయిబా ఖాన్ అన్నారు. తన జీవితంలో ఎప్పుడూ కాశ్మీరీ పండిట్ సముదాయానికి చెందిన కళాకారుడిని కాదు కదా, తానసలు కశ్మీరీ పండిట్‌నే చూడలేదని ఆమె అన్నారు.

"వారి శిల్పాలు, పెయింటింగ్స్, కళాకృతులు ఏర్పాటు చేయడం ద్వారా ఈ ప్రదర్శన పరిపూర్ణం అయ్యింది." ❑

---

## ఫెడరల్ స్ఫూర్తికి తిలోదకాలు

**(8వ పేజీ తరువాయి)**

మరింత కొట్టొచ్చినట్టు కనిపిస్తుంది. వారికి నైతికంగా కనీస స్థానమైనా దక్కలేదు. 370వ అధికరణానికి సంబంధించి ప్రభుత్వం ఏ చేయబోతోందో తెలుసుకునే హక్కైనా తమకు ఉండాలని కశ్మీర్ ప్రజలు భావించారు.

ఎలాంటి సంప్రదింపులు లేకుండా కశ్మీర్ ప్రత్యేక ప్రతిపత్తిని రద్దు చేయడం ద్వారా కేంద్ర ప్రభుత్వం అధికారాన్ని తన గుప్పెట్లో పెట్టుకోవాలన్న ఆత్రుతలో ఉందని తేలిపోయింది. సకల వ్యవహారాలూ తమ గుప్పెట్లోనే ఉంచుకోవాలనే ప్రయత్నం కొన్ని సార్లు విలోమ ఫలితాలు ఇవ్వవచ్చు. కశ్మీర్ కల్లోలం ఆధారంగానే అధికార కేంద్రీకరణ కోసం కేంద్ర ప్రభుత్వం ప్రయత్నించడం అంటే వ్యవసాయ, ఉపాధి, పట్టణాల నిర్వహణా రంగంలో ఉన్న సంక్షోభాన్ని విస్మరించడమే. ఘర్షణలను నివారించడానికి ఫెడరల్ విధానం మంచి అవకాశం కల్పిస్తుంది. రాష్ట్రాలను కేంద్ర పాలిత ప్రాంతాలుగా కుదించడంవల్ల ఇది సాధ్యం కాదు. కానీ ప్రస్తుత కేంద్ర ప్రభుత్వం అధికార కేంద్రీకరణ ద్వారానే ఘర్షణలను పరిష్కరించాలనుకుంటోంది. వికేంద్రీకృతంగా ఉన్న ఘర్షణలను విస్మరిస్తే దానివల్ల బాధితులైన వారు ఎప్పుడో ఉవ్వెత్తున ఎగసిపడే ప్రమాదం పొంచి ఉంటుంది. ఇచ్చి పుచ్చుకునే ధోరణిలో ఫెడరల్ విధానాన్ని అనుసరిస్తేనే ఘర్షణల నివారణ సాధ్యం అవుతుంది. మానవుల అభివృద్ధి ఆధారంగా ఉండే ఫెడరల్ విధానంలో సమానత్వ భావన ఉంటుంది. అంటే నాగరికంగా జీవించే అవకాశం కల్పించాలి. ❑

**ఇ.పి.డబ్ల్యు. సంపాదకీయం**

### వైక్కం మొహమ్మద్ బషీర్ మళయాళ కథ

# అవని తల్లికి అసలైన వారసులు

- తెలుగు : కలేకూరి ప్రసాద్

ఈ విశాల భూఖండంలో ఒక చిన్న మడి చెక్కకు యజమానిని అయిన తర్వాత నా భవిష్యత్తుకు ఏ ఢోకా లేదన్న నమ్మకం నాకు కలిగింది. అది రెండెకరాల చేను. అందులో కొబ్బరి చెట్లున్నాయి. ఒక పాత యిల్లు కూడా ఉంది. దానికి కాస్త మరమ్మత్తులు చేయిస్తే సరిపోతుంది.

కొబ్బరికాయలకు ధరలు బాగా పలుకుతున్న రోజులవి. కొబ్బరి చెట్లు నిండా కాపు కాస్తాయన్న ఆలోచనతోనే పొంగిపోయాను. అది ఒక ఆనందకరమైన దృశ్యం.

అయితే అప్పుడే చొరబాటుదారులు వచ్చారు. నా పట్టాకున్న చట్టబద్ధతను కూడా ధిక్కరించి హద్దులు మీరి లోపలికి చొరబడ్డారు. సరిహద్దులకు వేసిన కంచెను ధిక్కరించారు. సెంట్రీ లాగా కాపలా కాస్తున్న నా పెంపుడు కుక్క షాన్‌ను కూడా ధిక్కరించి నా పొలంలోకి వచ్చారు. వాళ్ళకు ప్రపంచంలో ఎవరన్నా భయం లేనట్లు కనిపిస్తోంది. చివరకు ప్రభుత్వం అన్నా భయమే లేదనిపిస్తుంది.

ముందుగా పక్షులు, సీతాకోక చిలుకలు వచ్చాయి. రకరకాల పిట్టలు, రంగురంగుల చిలుకలు. ఎన్నెన్నో సీతాకోక చిలుకలు చెట్లు, మొక్కల పైన వాలాయి. పక్షులు కిలకిల రావాలు చేశాయి. సీతాకోక చిలుకలు సూర్యకాంతిలో తమ రెక్కల్ని మెరిపింపచేస్తూ చేనంతా గిరికీలు కొట్టాయి.

వాటిని మేం తొక్కేయలేక పోయేవాళ్ళం అయితే ఆ వెంటనే కాకులొచ్చాయి. యితర పక్షుల కన్నా ఈ కాకుల గోల మహా దుర్భరంగా వుంది. అంతే కాకుండా అవి కోడి పిల్ల మీద పడ్డాయి.

ఆ తర్వాత గద్దలొచ్చాయి. అవి కూడా కొబ్బరి చెట్లపై వాలి ఎదురు చూస్తూ కూర్చున్నాయి. కాసేపటికే పక్కనే వున్న వెదురు పొదల్లోని ముంగిసలూ, ఆ దగ్గరలోనే వున్న నక్కలు కూడా కోళ్ళ మీద పడదానికి సిద్ధంగా వున్నాయి.

ఈ జీవులన్నింటికీ నా భూమి ఏమి పని అని నేను ఆలోచిస్తుండగానే కాళ్ళు గానీ చేతులు గానీ రెక్కలు గానీ లేని జీవం ఒకటి నా ముందు నిలబడింది. ఈ భూమితో నీకేం పని అని నన్ను అడగడానికా అన్నట్లుగా పడగ విప్పింది.

నా రెండెకరాల పొలాన్ని వెంటనే వదలి వెళ్ళండి అన్నాను. అయితే ఎచటికి పోతోందని ఈ భూమిలోని అణువణువునూ మనిషి కొని పారేశాడు. పనసకాయలు పండుతున్నాయి. వాటితో ఉడుతలు, కాకులూ విందులు చేసుకుంటున్నాయి. జామకాయల్నీ, సపోటాలనీ, మామిడి కాయల్నీ పక్షులూ, గబ్బిలాలూ తినేస్తున్నాయి అన్నది భార్య.

'దానిలోని సౌందర్యమే అది; ఎటువంటి ఆధారమూ లేకుండా విశ్వంఅంతటినీ నిలిపి వుంచుతున్న భగవంతుడు తాను సృష్టించిన జీవుల కోసం అనేక అంశాలను సృష్టించాడు. పళ్ళు, దుంపలు, గడ్డి, పువ్వులు, నీరు, గాలి, వెచ్చదనము, కాంతి యిలా ఎన్నింటినో, పక్షులు, పశువులు, కీటకాలు వీటన్నింటికీ కూడా భూమిపైన ఉత్పత్తవుతున్న వాటికి కూడా హక్కు వుందని మనం ఎప్పుడు గుర్తుంచుకోవాలని నీకు అన్పించడం లేదా' అన్నాను.

అయితే పాత సామెతను తమ తాతల తండ్రుల నుండి విన్నామనీ దాని ప్రకారం గుడ్లగూబలు శాఖాహారం తినవనీ చెప్పారు. రెండు నెలలు గడిచిన తర్వాత అసలు నేరస్తులను గుర్తించాం. గబ్బిలాలు గబ్బిలాలే అసలు నేరస్తులు. చీకటి పడగానే గుంపులు గుంపులుగా గబ్బిలాలు వచ్చి కొబ్బరి కాయల పైన వాలి వాటికి వేలాడతాయి. వాటి నుండి కొబ్బరినీ, నీళ్ళనీ పీల్చుకుని కడుపు నింపుకుంటాయి. ఆ తర్వాత సంతృప్తిగా ఎగిరిపోతాయి.

"ఒక తుపాకీ కొందాం. దాంతో గబ్బిలాలనీ, నక్కల్నీ, అడవి పిల్లుల్నీ కాల్చి పడేద్దాం" అని నా భార్య అన్నది. నేను కొనను. నాకు దాంతో ఏ సంబంధం ఉండడం నాకిష్టం లేదు. తుపాకీ అంటే క్రూరత్వానికి చిహ్నం. అది పాపానికి పుట్టిన శిశువు. మనిషన్నవాడు ఎన్నటికీ కనిపెట్టకూడనిది.

ఒక రోజు నా భార్య బంధువు ఖరీదైన తుపాకీ తీసుకుని

యింటికి వచ్చాడు. పది మైళ్ళ పరిధిలో రోజుకు దాదాపు మూడు వేల కొబ్బరికాయలు నాశనం అవుతాయి. ఇక్కడ కాల్చి చంపడంతో అర్థం లేదు. దగ్గరలోని చిన్న ద్వీపంలో ఒక పాత దేవాలయం వుంది. దాని పక్కనే రెండు మర్రి చెట్లున్నాయి. ఆ రెండు మర్రిచెట్ల పైన కనీసం మూడు వేల గబ్బిలాలైనా ఉంటాయి. వాటన్నింటినీ కాల్చి చంపేస్తాను. ఒక్క రోజులో కాకపోతే రెండు మూడు రోజుల్లో మూడు వేల గబ్బిలాల హతమైపోయే అద్భుతమైన దృశ్యాన్ని చూడాలనుకోవడం లేదా? అని అన్నాడు.

"గబ్బిలాల్లారా మిమ్మల్ని మీరే రక్షించుకోండి" అని ఉద్విగ్నంగా ప్రార్థించాను.

నిజంగా ఆశ్చర్యకరమైన అద్భుతం. గబ్బిలాలు రక్షింపబడ్డాయి. భగవంతుడా, మేం బతకడం కోసం ఎలుకల్ని చంపవలసి రావడం ఎంత దురదృష్టకరం. భూమిపై నున్న యితర జీవుల్ని నాశనం చేయకుండా మనుషులు బతకలేరా?

ఏ జీవినీ చంపకుండా మనం బతకడానికి ఒక శాస్త్రీయమైన పద్ధతి కావాలి. ఒక కొత్త ఆలోచన కావాలి. ఎలుకల్ని సృష్టించిన వాడా మమ్మల్ని క్షమించు. అవన్నీ దోషానికి గురై అంతరించి బోతున్నాయి. విషయమేమిటంటే మా జీవనోపాధికి ఏకైక ఆధారంగా వున్న కొబ్బరికాయలు నెలకు 900 నష్టపోతున్నాం. మమ్మల్ని క్షమించు, మమ్మల్ని క్షమించు.

రెండు గంటల పాటు షాపింగ్ చేసి యింటికి తిరిగి వచ్చింది నా భార్య. తాను కొనుగోలు చేసిన యితర సామాగ్రితో పాటు ఒక పెద్ద ఎలుకల మందు డబ్బా తెచ్చింది. ఆ ఎలుకల మందును అరటి పళ్ళలోనూ, అన్నంలోనూ కలిపి అన్ని చోట్లా చల్లింది. కొబ్బరి చెట్ల దగ్గర కూడా చల్లింది.

నాలుగు రోజుల్లో ఐదు కోళ్ళూ, పన్నెండు ఉడుతలూ, రెండు వందల ఎలుకలూ ఒక పిల్లీ కనుపించకుండా కాలపు తెరల వెనకకు మాయమై పోయాయి. చనిపోయిన ఎలుకలు కుళ్ళి కంపు కొడుతున్నాయి. ఎక్కడ చూసినా మృత్యువే కనిపిస్తోంది.

యిల్లంతా వ్యాపించింది. అయితే లేత కొబ్బరికాయలు రాలిపోవడం ఆగలేదు. పదిహేను రోజులు గడిచాయి. కొబ్బరి గెలల్ని తెంచడానికి చెట్లెక్కే వాళ్ళు యిదంతా గుడ్లగూబల పనే అసలు నేరస్తులు అవేనని చెప్పారు. అవే కొబ్బరికాయల్ని కాజేస్తున్నాయన్నారు.

నా భార్య, ఆమె బంధువు సిగ్గు ముఖాలతో యింటికి తిరిగి వచ్చారు. చావు తప్పి కన్ను లొట్టబోయి బతికి బయటపడి వచ్చాం' అని భయంతో వణుకుతున్న స్వరంతో నా భార్య చెప్పింది.

ఆ గుడి చుట్టూ కొన్ని యిళ్ళున్నాయి. ఒక్క క్షణంలోనే దాదాపు వంద మంది మనుషులు మారణాయుధాలతో వచ్చి మమ్మల్ని చుట్టుముట్టారు. గబ్బిలాలను కాల్చితే చంపేస్తామని బెదిరించారు. ఎందుకో తెలుసా? ఆ గబ్బిలాలు వాళ్ళ పూర్వీకుల ఆత్మలని వాళ్ళ విశ్వాసం.

'గబ్బిలాలు మన పూర్వీకుల ఆత్మలు కావు. దేవుడు సృష్టించిన అనేక జీవుల్లో అవి కూడా ఒకటి. కొబ్బరికాయలు నాశనం కానీ, ఫర్వాలేదు వాటి వాటాను అవి తీసుకున్న తర్వాత ఏం మిగులుతుందో దాంతోనే సంతృప్తి పడదాం' అని వాళ్ళతో చెప్పాను. 'వాటికి కొబ్బరికాయల పైన ఖచ్చితంగా హక్కు వుంది. కొబ్బరి చెట్ల లాగానే అవి కూడా భగవంతుడి సృష్టిలో భాగమే. సకల చరాచర జీవరాశుల్ని సృష్టించే అద్భుతమైన క్షణాల్లో జీవరాశులన్నీ భూమిపైన హక్కు వున్న నిజమైన వారసులే' అని చెప్పిన మాటలు గుర్తుంచుకో అని చెప్పాను. ❑


## జాతీయ స్ఫూర్తి

### ప్రత్యేక సంచిక ప్రకటనల రేట్లు

**1/4 డెమ్మీ సైజు**

| | |
|---|---|
| **లోపలి పూర్తిపేజీ సింగిల్ కలరు** | **రూ. 5,000/-** |
| **లోపలి అరపేజీ** | **రూ. 2,500/-** |

**కవరు పేజీ : మల్టి కలరు ప్రింటింగు**

| | |
|---|---|
| **లోపలి కవరు పేజీ** | **రూ. 10,000/-** |
| **వెనుక కవరు పేజీ** | **రూ. 20,000/-** |

పంపవలసిన చిరునామా :

**జాతీయ స్ఫూర్తి**

C/o. క్రాంతి నర్సింగ్ హోమ్, నన్నయ్య విగ్రహం వద్ద

మెయిన్‌రోడ్, **తణుకు - 534 211**

✆ **08819 222265, 93971 14495**

# ఏ నిర్మూలన కావాలిప్పుడు?



డా. ప్రసాదమూర్తి

ఈ రోజు ఒక మిత్రుడు నా ఫేస్ బుక్ ఇన్‌బాక్స్ లోకి ఒక వీడియో పంపించాడు. ఎవరో యువకుడు రోడ్డు మీద పడి వున్నాడు. కొందరు అతణ్ణి దారుణంగా కొడుతున్నారు. ఒకడు చేతులతో ముఖం మీద పిడిగుద్దులు కొడుతున్నాడు. ఇంకొకడు పైకి ఎగిరి అతని ఛాతీ మీద దూకుతున్నాడు. చుట్టూ చాలా మంది మూగి వున్నారు. కొడుతున్న వాళ్ళు జై శ్రీరామ్ అంటున్నారు. చుట్టూ ఉన్న వాళ్ళలో కూడా కొందరు అదే నినాదానికి వంత పాడుతున్నారు. ఎవరూ ఎవరినీ ఆపే ప్రయత్నం చేయడం లేదు. అంతా తమాషా చూస్తున్నారు. ఏ పుణ్యాత్ముడో పోలీసులకు ఉప్పందించినట్టుంది. రంగంలోకి పోలీసులు వచ్చారు. అతణ్ణి ఈడ్చుకుంటూ వ్యానులోకి ఎక్కించుకు తీసుకుపోయారు. అర్థమైంది విషయం ఏమిటో.

నిన్న మొన్ననే కదా మహాత్మా మహాత్మా అంటూ గాంధీ పాట పాడారు. గాంధీ కలలుగన్న భారతాన్ని నిర్మించామని ప్రపంచానికి ఛాతీ ఉబ్బించి మరీ చాటి చెప్పారు. మరి ఇదేమిటి? చూస్తే మనసంతా వికలమైపోయింది. సంఘటన ఎక్కడ? ఎలా జరిగింది? ఎవరు బాధితుడు? ఎవరు దోషులు? ఈ ప్రశ్నలతో పెద్ద పనేముంది? తెలియని జవాబులు మాత్రం ఏమున్నాయి? కళ్ళు మూసుకుని..చెవులు మూసుకుని..నోరు మూసుకుని గాంధీగారు చెప్పింది విలోమ పద్ధతిలో ఆచరిస్తే పోలేదా? మనకెందుకు ఇదంతా అని సరిపెట్టుకుంటే సరికదా. అబ్బే మనసు వింటుందా? వినదు. లోపల్లోపలే కనలిపోతూ కదిలిపోతూ వుంది. మరి గాంధీ దేనికి ఆదర్శంగా నిలిచినట్టు? అహింస హంస ఎటు ఎగిరిపోయింది? సత్యం వధ ఎవరి చేతుల్లో జరిగింది? ఏ రాజ్యాన్ని గాంధీ కలగన్నాడు, ఏ రాజ్యం ఏలుబడిలో వుంది? ఏ నీతిని ఏ రీతిని ఏ జాతిని గాంధీ ఆదర్శీకరించాడు? ఆ నీతి..ఆ రీతి..ఆ జాతి ఇప్పుడెక్కడ?

గాంధీ కలగన్న భారతాన్ని నిర్మించామని దేశ ప్రధాని ఆడంబరంగా చేసిన ప్రకటన ఆంతర్యం ఏమిటి? ఏడుపూ రావడం లేదు. నవ్వూ రావడం లేదు. అసహ్యంగా వుంది. బహిరంగ మల విసర్జన నిర్మూలన కోసమే గాంధీ అనే మహాత్ముడు ఈ సనాతన భారతావనిలో జన్మనెత్తినట్టు చివరి చిత్రణ చివరికిలా జరిగిందన్నమాట. కొన్ని మాటలు అనక తప్పడం లేదు..

- దృశ్యాదృశ్య హింసోన్మత్త విసర్జన నిర్మూలన ఎప్పుడు?
- హీనాతి హీన అవినీతి విసర్జన నిర్మూలన ఎప్పుడు?
- దారుణాతి దారుణ మతోన్మాద నినాద విసర్జన నిర్మూలన ఎప్పుడు?
- ఈవీఎం ప్రొడక్షన్ బ్లాక్ బస్టర్ విసర్జన నిర్మూలన ఎప్పుడు?
- అనునిత్య అసత్య ప్రేలాపనాలాపనా విసర్జన నిర్మూలన ఎప్పుడు?
- పర్యావరణ ప్రదూషిత వాచాలత విసర్జన నిర్మూలన ఎప్పుడు?
- స్వయం ఉదర మర్దనోద్దండ స్వోత్కర్ష హర్షోల్లాస విసర్జన నిర్మూలన ఎప్పుడు?
- మాయామేయ మహానటనా వైదుష్య విసర్జన నిర్మూలన ఎప్పుడు?

  ఎప్పుడు ఎప్పుడు ఎప్పుడు ఎప్పుడు?
- విద్వేష విధ్వంస విలయ వికటాట్టహాస విసర్జన నిర్మూలన ఎప్పుడు?
- ఇన్ని బహిరంగ మలినాల విసర్జనాల నిర్మూలన ఎప్పుడు?


చెప్పండి అయ్యలారా?

కనీసం బాపూ కోసమైనా చెప్పండి ప్రభూ..!! ❑



# బిజెపి నా హిందూమతాన్ని అవమానిస్తోంది

**అవిజిత్ పాథక్**
సామాజిక శాస్త్ర ఆచార్యులు
జవహర్‌లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయం, న్యూఢిల్లీ



రాబోయే ఎన్నికల ఫలితాలను 'నిపుణులు' సమీక్షిస్తారు. నరేంద్ర మోడీ చరిష్మాను ఆకాశానికెత్తేయడం, అమిత్‌షా తన సూపర్‌మాన్ లక్షణాలతో నిర్మించిన మహాసంస్థతో తలపడడం రాహుల్‌గాంధీ వంటి అసమర్థుడికి ఎంత అసాధ్యమో ఊదర గొట్టడం వంటి పనులు అత్యుత్సాహం ఉన్న మన టెలివిజన్ యాంకర్లు నిర్వహిస్తారు.

ఏమైనా ఒక మామూలు మనిషిగా నేనొకటి గాఢంగా నమ్ముతున్నాను. ఏమిటంటే బిజెపి హిందూమతం ఆత్మకు తీవ్రంగా తూట్లు పొడిచింది. అది హిందువుగా ఉండడాన్ని వక్రీకరించింది. అవును ఇస్లాంను ఖండిస్తూ మోదీ-షాల ఉసిగొల్పే ఉన్మాద ప్రసంగాలు విన్నప్పుడూ, గోసంరక్షణ పేరుతో సాగుతున్న మూక దాడుల దుర్మార్గాన్ని చూస్తున్నప్పుడూ – నేను సిగ్గుతో తల వంచుకుంటాను. అవును నేను హిందువునే. కానీ నా మతాన్ని ఈ విధంగా దిగజార్చడాన్ని తట్టుకోలేను.

లౌకికవాదులైన నా మిత్రులు కొందరు నేను హిందూ మతాన్ని కాల్పనిక స్థాయికి తీసుకు వెళుతున్నానని భావిస్తారు. ఒక సంస్థాగత మతంగా అది కూడా సమస్యాత్మకమేనని వాదిస్తారు. అందువల్ల దాని నుంచి జీవితానికి హామీ ఇచ్చే విప్లవాత్మకమైన దేన్నీ పొందలేమంటారు. నిజమే, ఇస్లాం, క్రైస్తవం వంటి అన్ని సంస్థాగతమైన మతాల్లో ఉన్నట్లే హిందూ మతంలోనూ లోపాలున్నాయి. ఉదాహరణకు మనకిప్పుడు నిర్దాక్షిణ్యమైన నిచ్చెన మెట్ల పితృ స్వామిక బ్రాహ్మణీయ సంప్రదాయం గురించి స్పష్టంగా తెలుసు. అంబేద్కరిస్టు కానక్ఖర్లేకుండానే తోటి మానవుల్ని హీనపరిచి హింసించడం ద్వారా అది సంస్కృతినెట్లా నష్టపరిచిందో అర్థం చేసుకోగలం.

అట్లాగే, మతంలో పౌరోహిత్యపు వికారమూ, కర్మకాండల బాధ్యతలు మానవ చైతన్య ప్రవాహానికెట్లా అడ్డుకట్ట వేశాయో కూడా తెలుసు. పైగా సరళీకృత ఆర్థిక వ్యవస్థ కొత్తగా పుట్టించిన సెలబ్రిటీ బాబాలు మతత్వాన్ని తక్షణ జ్ఞానోదయం కలిగించగల మార్కెట్ సరుకుగా దిగజార్చడం కూడా చూస్తూనే ఉన్నాం.

ఏదేమైనా, తాలిబానిజమ్‌ను దాటుకుని ఒక ముస్లిం, వాటికన్ ఆర్భాటాల్ని మించి ఒక క్రైస్తవుడు చూడగలిగినట్లు నేను కూడా వర్తమానాన్ని దాటుకుని హైందవంలో కూడా ప్రేమ, రక్షణలతో కూడిన ఒక సాధ్యాన్ని చూస్తున్నాను.

ఇతిహాసాలు ఉల్లేఖించిన జీవిత ధర్మం, వాటిల్లో మంచి చెడుల మధ్య జరిగిన అంతర్నాటకం పదే పదే నాకు జ్ఞాపకం వస్తాయి. అట్లాగే తమో, రజో, సత్త్వ గుణాల చలనశీలత, మానవ అస్తిత్వం వంటి చిక్కు ప్రశ్నలు కూడా. ఉపనిషత్తులు నన్ను తమ గంభీరమైన, ఉత్కృష్టమైన ప్రార్థనల్లోకీ, రవీంద్రనాథ్ టాగూర్ రచించి స్వరపరచిన మంత్ర సమానమైన గీతాల మాదిరిగా భావాతీతమైన అన్వేషణలోకి తీసుకువెళతాయి.

అట్లాగే, రామకృష్ణుడు, రమణ మహర్షి వంటి సాధువులు ధ్యాన ప్రశాంతిని, ప్రేమను, బ్రహ్మానందాన్ని కలిగిస్తారు. వివేకానందుడు, గాంధీ వంటి వారు ప్రేమ, జ్ఞానం, కార్యాచరణలనే మూడు యోగాల్ని మిళితం చేసి ప్రభావితం చేస్తారు. హిందూ మత ఈ సంప్రదాయమే అన్ని అడ్డుగోడల్నీ బద్దలు కొట్టింది. గౌతమ బుద్ధుడు, నారాయణ గురు, సూరదాసు, మీర్జా, నిజాముద్దీన్ ఔలియా, మదర్ థెరిస్సా, టాగూర్, నెహ్రూ, లోకాయతా వేదాంత – ఏదీ ఏదీ పరాయి కాదు. దేన్నయినా పీల్చేసుకునే మహాసముద్రం అది.

**బిజెపి ఒక ప్రతివాదం :**

ఆధ్యాత్మికంగా సంపద్వంతమైన, రసవంతమైన, సాగే గుణం ఉన్న హైందవానికి బిజెపి ఒక ప్రతివాదం (anti-thesis) అని చెప్పడానికి నేనే మాత్రం సందేహించను. అది హిందూ మతాన్ని ఒక ద్వేష ఖడ్గంగా దిగజార్చింది. దాని ఆధ్యాత్మిక దివ్యానుభవాన్ని చంపేసింది. అది సెంటిమెంట్లను రెచ్చగొట్టి మూకతత్వాన్ని ప్రేరేపిస్తుంది. ఆంతరిక అన్వేషణలోని కవితాత్మ స్థానంలో 'శత్రువు'తో యుద్ధం వంటి పశుభావనల్ని ప్రవేశ పెడుతుంది. అదొక వినాశనకరమైంది. రాక్షసమైంది.

అది వివేకానందుడి కార్యాచరణ కల్గిన వేదాంతం నుంచి సావర్కర్ హింసాత్మక హిందూత్వ దాకా, యాజ్ఞవల్క్యుడితో మైత్రేయి సంభాషణ నుంచి ఉమాభారతి ఉపన్యాసాల దాకా హిందూ మతాన్ని దిగలాగింది. బిజెపి హిందూ సంస్కృతిలో తెచ్చిన మార్పు ఇదే. ఇదే మనల్ని హైన్యంలోకి దించింది.

కొన్ని సార్లు నేను రోజు వారీ ప్రపంచం నుంచి తీసుకున్న పోలికలతో వేదాంత జ్ఞానాన్ని రామకృష్ణ పరమహంస వివరించిన కథలు చదువుతాను. అప్పుడే ఏ టెలివిజన్ ఛానల్‌లోను యోగి ఆదిత్యనాథ్ వంటివారు కనిపిస్తారు. నేను వెంటనే ఏడుస్తాను. దిగజారుడుతనం నన్ను కుదిపేస్తుంది. లేదూ, నౌఖాలీలో గాంధీని గుర్తు చేసుకుంటున్నప్పుడు మోడీ ఉన్మాద ప్రసంగాలు, నాటకీయత నా ముందు నిలుచుంటాయి. వెంటనే హిందూ మతానికివి చెడ్డ రోజులు అనుకుంటాను.

ఉగ్రతత్వ జాతీయత, పెద్ద పెద్ద పదాల దేశభక్తి, భీకరత్వాన్ని ప్రదర్శించే పోస్టర్లు హిందూ ఆధ్యాత్మికతకు, ప్రేమకూ, వివేకానికీ– వ్యతిరేకమూ, అనైతికమూ. ఈ హైందవంలో ఏ శంకరాచార్యుడు, భ్రమతో కూడిన 'మాయ' నుంచి మనల్ని రక్షించలేడు. Life Divine గురించి మాట్లాడే ఏ అరవిందుడు ఇక్కడ లేడు. వారికి బదులుగా సాక్షి మహరాజ్ ఉన్నాడు. వినాయకుడి ప్లాస్టిక్ సర్జరీ కథలున్నాయి.

విదేశీ ముస్లిం దాడుల గురించీ, కాశ్మీరీ ఉగ్రవాదుల గురించీ, అనైతిక కమ్యూనిస్టుల గురించీ, గాంధేయ పిరికిపందల గురించీ ఎంత కాలం వింటాం ? నాథూరామ్ గాడ్సేలకు ఎంతకాలం ఉత్సవాలు జరుపుతాం ? ఎంతకాలం ఇతరుల్ని ద్వేషించుకుంటూ మన మతాన్ని నిలబెట్టుకుంటాం? కుళ్ళి పోతున్న ఈ హిందూ మతాన్ని ఇంకెంత కాలం అంగీకరిస్తాం?

మనమిక నిర్ణయించుకోవలసిందే. స్వయం ప్రకటిత రక్షకుల నుంచి హిందూ మతం రక్షింపబడవలసిందే.

రాబోతున్న ఎన్నికల్లో ఇదొక నిర్ణయాత్మక అంశం అవుతుందా? ❑

---

## ఆర్టికల్ 370 సవరణ....

(9వ పేజీ తరువాయి)

### రాష్ట్ర పునర్వ్యవస్థీకరణ బిల్లుతో ఏం మార్పులు వస్తాయి?

దీనిపై బీబీసీ ప్రతినిధి వినీత్ ఖరే రాజ్యాంగ నిపుణులు కుమార్ మిహిర్‌తో మాట్లాడారు.

ఆర్టికల్ 370 సవరణ కావడంతో రాష్ట్ర పునర్వ్యవస్థీకరణ బిల్లును పార్లమెంటు ఉభయ సభల్లో ఆమోదించాలి. జమ్ము–కశ్మీర్ రాష్ట్ర హోదాపై చర్చించాలి.

పార్లమెంటు ఉభయసభల్లో బిల్లు ఆమోదం పొందితే వచ్చే మార్పులు ఇవే.

- ఇంతకు ముందు 'శాశ్వత నివాసి'గా రాష్ట్రంలో ఉన్నవారు మాత్రమే ఆస్తులు కొనుగోలు చేయగలిగేవారు. ఇప్పుడు ఎవరైనా అక్కడ ఆస్తులు కొనవచ్చు.
- ఇంతకు ముందు, 'శాశ్వత నివాసులను' మాత్రమే రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాల్లో నియమించేవారు. ఇప్పుడు ఎవరినైనా నియమించవచ్చు.
- ఇంతకు ముందు ఇక్కడ శాంతి భద్రతలు ముఖ్యమంత్రి అదుపులో ఉండేవి. ఇప్పుడు రాష్ట్ర ప్రతినిధి అంటే లెఫ్టినెంట్ గవర్నర్ ద్వారా ఇవి నేరుగా కేంద్ర హోంమంత్రి పరిధిలోకి వస్తాయి.
- కేంద్రం రూపొందించే చట్టాలన్నింటినీ ఇంతకు ముందు రాష్ట్ర అసెంబ్లీ ఆమోదించాల్సి వచ్చేది. ఇప్పుడు అవి ఆటోమేటిగ్గా అమల్లోకి వస్తాయి.
- అలాగే, ఇప్పుడు సుప్రీంకోర్టు ఆదేశాలు కూడా ఇక్కడ నేరుగా అమలవుతాయి.
- రాష్ట్ర ప్రభుత్వ జెండాకు ఇప్పుడు ప్రాధాన్యం ఉండదు. ప్రస్తుతమున్నదాన్ని ఏం చేయాలనే దానిపై పార్లమెంటు లేదా కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుంది.
- రాష్ట్ర అసెంబ్లీ కాలపరిమితి ఆరేళ్ల నుంచి ఐదేళ్లకు తగ్గిస్తారు.
- మహిళలకు వర్తించే స్థానిక సంప్రదాయ వ్యక్తిగత చట్టాలను తొలగిస్తారు.
- ఇక్కడ ఐపీసీ అమలు చేయాలా లేక స్థానిక రన్‌బీర్ పీనల్ కోడ్ అమలు చేయాలా అనేది కేంద్ర ప్రభుత్వం లేదా పార్లమెంటు నిర్ణయిస్తుంది.
- ఇంతకు ముందు వర్తించిన పంచాయతీ చట్టాలను అలాగే ఉంచాలా లేక మార్చాలా అనేదానిపై పరిశీలిస్తారు. ❑

# మన మార్క్స్



\- గ్రాంషీ

సరిగ్గా వంద సంవత్సరాల కింద మార్క్స్ శతజయంతి సందర్భంగా మార్క్సిజం విశిష్టతను చాటి చెపుతూ ఇటలీకి చెందిన మార్క్సిస్టు మహోపాధ్యాయుడు ఆంటోనియో గ్రాంషీ రాసిన వ్యాసం.

(ఇటలీ కమ్యూనిస్టు పార్టీ నాయకుడు, మార్క్సిస్టు మేధావి ఆంటోనియో గ్రాంషీ (1891-1937) ఇటలీకి చెందిన సోషలిస్టు పత్రిక ఇల్ గ్రిడో డెల్ పొపొలోలో 1918 మే 4న మార్క్స్ శత జయంతి సందర్భంగా రాసిన వ్యాసం ఇది. సరిగ్గా ఆ సమయానికే ఇటలీలో బెనిటో ముసోలినీ నాయకత్వంలో ఫాసిజం బలపడడం మొదలయింది. చివరికి 1922లో ముసోలినీ ప్రధానమంత్రి కూడ అయి ఫాసిస్టు పాలన ప్రారంభించాడు. తన మీద హత్యా ప్రయత్నానికి కమ్యూనిస్టులు కుట్ర పన్నుతున్నారనే అబద్ధపు ఆరోపణతో ముస్సోలినీ 1926లో కమ్యూనిస్టుల మీద, ప్రగతి శీలవాదుల మీద దారుణ దమనకాండ ప్రారంభించి, అప్పటికి ఇటలీ కమ్యూనిస్టు పార్టీ నాయకుడుగా ఉన్న గ్రాంషీని అరెస్టు చేయించాడు. గ్రాంషీకి వ్యతిరేక వాదనలు చేస్తూ ప్రాసిక్యూషన్ని ఈ మేధను కనీసం ఇరవై సంవత్సరాలు పని చేయించకుండా ఉండడం అవసరం అని న్యాయస్థానాన్ని కోరింది. న్యాయస్థానం వెంటనే గ్రాంషీకి ఐదు సంవత్సరాల జైలు శిక్ష విధించింది. ఏడాది తర్వాత మరొక ఇరవై సంవత్సరాల శిక్ష విధించింది. అరెస్టయ్యే నాటికి ముప్పై ఐదేళ్ళ వయసులో ఉన్న గ్రాంషీ జైలులో తీవ్ర అనారోగ్యం పాలయ్యాడు. గ్రాంషీని విడుదల చేయాలని ప్రపంచ వ్యాప్తంగా జరిగిన నిరసన ప్రదర్శనలను, విజ్ఞప్తులను ముసోలినీ ప్రభుత్వం పెడచెవిన పెట్టింది. చివరికి పదకొండు సంవత్సరాల జైలు జీవితం తర్వాత 1937లో గ్రాంషీ జైలులోనే మరణించాడు. ఆయన జైలులో చేసిన ఆలోచనలు, రచనలు దాదాపు మూడు వేల పేజీలు, ముప్పై నోట్ పుస్తకాలలో మిగిలిపోయాయి. అంతకు ముందూ, జైలులోనూ కూడ ఆయన మార్క్సిజం మీద ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక అంశాల మీద చేసిన ఆలోచనలు మార్క్సిస్టు ఆలోచనా ధారకు ఎన్నో సృజనాత్మక కానుకలందించాయి.

మనం మార్క్సిస్టులమేనా ? అసలు మార్క్సిస్టులనే వాళ్లు ఉంటారా? మూర్ఖత్వమా, నువ్వొకదానివే శాశ్వతమైన దానివి. బహుశా ఈ ప్రశ్న రానున్న కొన్ని రోజుల్లో, మార్క్స్ శతజయంతికి అటూ ఇటుగా, చాలా మంది లేవనెత్తుతారు. ఎన్నెన్నో సిరా నదులూ, తెలివిమాలినతనపు నదులూ ప్రవహిస్తాయి. పిచ్చి ప్రేలాపనలూ, కళాత్మకమైన టక్కుటమారాలూ ఎప్పటికీ చెడిపోని మానవ వారసత్వ సంపద కదా... మార్క్స్ ఒక అందమైన చిన్న సిద్ధాంతం ఏదీ రాయలేదు. స్థల కాలావధులకు అతీతంగా, ప్రశ్నించడానికి వీలులేని, పరమ నియమాలతో, నిర్ద్వంద్వమైన కర్తవ్యాలతో నిండిన కాల్పని కథావళులను వదిలిపోయిన ప్రవక్త కాడాయన. ఆయన వదిలిపోయినది ఒకే ఒక్క విస్పష్టమైన కర్తవ్యం, నియమం : అది ప్రపంచ కార్మికులారా, ఏకం కండి అనే నినాదం. సంఘటితం చేసే కర్తవ్యం, ఆ కర్తవ్యాన్ని ప్రచారం చేయడం ఒక్కటే బహుశా మార్క్సిస్టులకూ, మార్క్సిస్టేతరులనూ వేరు చేసేది. అది చాల చిన్నదనిపిస్తుంది. కాని చాల పెద్దది కూడ. మరి ఇందులో మార్క్సిస్టు కాకుండా ఉండాలని ఎవరనుకుంటారు ?

అయినా అది అలాగే ఉంటుంది. తమకు తెలిసినా తెలియకపోయినా ప్రతి ఒక్కరూ ఎంతో కొంత మార్క్సిస్టులే. మార్క్స్ మహానుభావుడు. ఆయన ఆచరణ ఫలప్రదమైంది. ఆయనేమీ శూన్యంలోంచి ఏదో కనిపెట్టాడని కాదు. ఆయన తన ఊహలోంచి ఒక చారిత్రక దృక్పథాన్ని తవ్వి తీశాడని కాదు. కాని అప్పటివరకూ శకలాల రూపంలో, అసంపూర్ణంగా, అపరిణతంగా ఉన్నది ఆయనలో పరిణతిగా, వ్యవస్థగా, చైతన్యంగా రూపుదిద్దుకుంది. ఆయన వ్యక్తిగతంగా సాధించిన అవగాహన ప్రతి ఒక్కరి అవగాహన అయింది. అందువల్ల మార్క్స్ కేవలం మేధావి కాదు, ఆయన ఆచరణవాది. ఆయన ఆలోచనలో మాత్రమే కాదు ఆచరణలో కూడ మహానుభావుడు, సార్థక జీవి. ఆయన పుస్తకాలు ఆలోచనలను మార్చినట్టుగానే ప్రపంచాన్ని మార్చాయి. మానవజాతి చరిత్రలో మేధస్సు, చైతన్య స్ఫూర్తి ప్రవేశించిందనడానికి మార్క్స్ సూచన.

సరిగ్గా చరిత్రలో మనిషి పాత్ర గురించి థామస్ కార్లైల్ కూ హెర్బర్ట్ స్పెన్సర్‌కూ మధ్య జరిగిన మహా చర్చ జరిగిన కాలంలోనే ఆయన కృషి వెలువడింది.

కార్లైలేమో ఆధ్యాత్మిక ఐక్యతతో నిగూఢమైన సమ్మేళనం జరిగిన నాయకుడే, మహా వ్యక్తే మానవజాతి భవిష్యత్తును నిర్ధారిస్తాడని, సంపూర్ణతా, పవిత్రతా నిండిన భ్రమాజనిత స్థలంలో అపరిచితమైన, క్షణభంగురమైన గమ్యానికి నడిపిస్తాడనీ అన్నాడు.

స్పెన్సరేమో ప్రకృతినీ, పరిణామాన్నీ, యాంత్రిక చలనాన్నీ, నిర్జీవ సాధారణీకరణనూ నొక్కి చెప్పాడు. మనిషంటే ఒక ప్రాకృతిక శరీరంలోని ఒకానొక అణువు అన్నాడు. అమూర్తమైన నియమానికి విధేయంగా ఉండే అణువు అనీ, కాని వ్యక్తులలో అది చారిత్రక నిర్దిష్టతగా, తక్షణ ప్రయోజనంగా పర్యవసిస్తుందనీ అన్నాడు.

ఈ చరిత్రలో ఒక మహాకాయుడిలా బలవత్తరమైన శక్తితో విస్పష్టంగా తనను తాను ప్రవేశ పెట్టుకున్నాడు మార్క్స్. ఆయన మార్మికవాది కాదు. ప్రత్యక్షేక వాదం ప్రతిపాదించిన అధి భౌతికవాదీ కాదు. ఆయన చరిత్రకారుడు. గత కాలపు దస్తావేజుల వ్యాఖ్యానకర్త. ఆ దస్తావేజులలో కొన్ని ఎంపిక చేసుకుని వ్యాఖ్యానించిన వాడు కాదు, సమస్త దస్తావేజులనూ తన పరిధిలోకి తీసుకున్నవాడు.

అప్పటి వరకూ మానవానుభవాల చరిత్రల అంతర్గత లోపం అదే. అవన్నీ దస్తావేజులలోని ఒక భాగాన్ని మాత్రమే పరీక్షించి, పరిగణనలోకి తీసుకున్నవి. ఆ ఎంపిక చేసిన భాగం కూడ చారిత్రక సంకల్పం వల్ల కాదు, కేవలం పాక్షిక అభిప్రాయ దురభిప్రాయాల వల్ల జరిగింది. ఆ అభిప్రాయ దురభిప్రాయాలు అసంకల్పితంగా, మంచి మనసుతోనే ఏర్పడినా సరే. ఆ పరిశోధనంతా సత్యం కోసం, కచ్చితత్వం కోసం, గతకాలపు జీవితాన్ని సమగ్రంగా పునఃసృష్టించడం కోసం జరగలేదు. కేవలం ఒక ప్రత్యేక కార్యకలాపాన్ని ఎత్తి పట్టడానికి, అంతకు ముందే తమ మనసులో ఉన్న ప్రాతిపదికను నిరూపించడానికి మాత్రమే జరిగింది. చరిత్ర సంపూర్ణంగా భావాల క్షేత్రం. మనిషిని కేవలం ఒక ఆత్మగా, శుద్ధ చైతన్యంగా మాత్రమే అక్కడ గుర్తించారు. ఈ భావన వల్ల రెండు తప్పుడు పర్యవసానాలు సంభవించాయి. మనుషులలో రూపొందిన భావాలన్నీ కేవలం యథేచ్ఛగా, కాల్పనికంగా వెలువడినట్టు అనిపించింది. ఇక ప్రాముఖ్యత పొందిన వాస్తవాలు కేవలం పిట్ట కథలూ ఉపాఖ్యానాలూ మాత్రమే గాని చరిత్ర కాదు. చరిత్రను దాని నిజమైన అర్థంలో రాసి ఉన్నారంటే అది కేవలం ఆయా వ్యక్తులు విడివిడిగా ప్రదర్శించిన అద్భుత ప్రజ్ఞ వల్లనే కాని చరిత్ర రచనను ఒక క్రమబద్ధమైన, చైతన్యపూర్వకమైన శాస్త్రీయ కార్యాచరణగా భావించినందు వల్ల కాదు.

మార్క్స్‌కు కూడ చరిత్ర అంటే భావాల క్షేత్రమే. ఆయనకు కూడ మనిషి చైతన్యమే ప్రధానం. వ్యక్తులు ఒంటరిగా గాని, సంఘటితంగా గాని సాగించే చైతన్య పూర్వక కార్యాచరణే చరిత్ర. కాని మార్క్స్ దృష్టిలో ఆ భావాలు, చైతన్యం సారాన్ని సంతరించు కున్నాయి. తమ యథేచ్ఛను వదిలించుకున్నాయి. అవి ఇంకెంత మాత్రమూ కాల్పనికమైన మత లేదా సామాజిక అమూర్తత్వాలు కావు. వాటి సారాంశం ఆర్థిక వ్యవస్థలో, వాస్తవికమైన కార్యాచరణలో, ఉత్పత్తికీ, వినిమయానికీ సంబంధించిన వ్యవస్థలలో, సంబంధాలలో ఉంది. అంటే చరిత్రగా జరిగేది శుద్ధమైన వాస్తవిక (ఆర్థిక, నైతిక) కార్యాచరణ. ఒక భావన నిజం కావాలంటే అది కేవలం తార్కికంగా శుద్ధ సత్యంతో, శుద్ధ మానవతతో సమన్వయంలో ఉంటే సరిపోదు. అది ఒక ప్రణాళిక లాగనో, మానవజాతి సాధించవలసిన సాధారణ నైతిక లక్ష్యం లాగనో మాత్రమే ఉనికిలో ఉండదు. అందుకు భిన్నంగా అది ఆర్థిక వాస్తవికతలోనే తన సార్థకతను సాధిస్తుంది. ఆర్థిక వాస్తవికతలోనే తనను తాను నడుపుకోగల సాధనాన్ని కనిపెడుతుంది.

ఒక దేశపు, ఒక సమాజపు, ఒక సామాజిక బృందపు చారిత్రక లక్ష్యాలు ఏమిటో ఖచ్చితంగా తెలుసుకోవాలంటే, మొట్టమొదట ఆ దేశంలో, ఆ సమాజంలో ఎటువంటి ఉత్పత్తి, వినిమయ వ్యవస్థలూ సంబంధాలూ ఉన్నాయో తెలుసుకోవాలి. ఆ పరిజ్ఞానం లేనట్టయితే కేవలం పాక్షిక గ్రంథాలు, సిద్ధాంత పత్రాలు రాయడం మాత్రమే వీలవుతుంది. ఆ గ్రంథాలు సంస్కృతీ చరిత్రకు ఉపయోగకరమైనవే. వాటిలో అప్రధానమైన ప్రతిఫలనాలు దొరుకుతాయి, సుదూర పర్యవసానాలు దొరుకుతాయి కాని అది చరిత్ర కాజాలదు. సుదృఢమైన సాంద్రతతో ఉండే వాస్తవిక కార్యాచరణ అందులో బైటపడదు.

విగ్రహాలు వాటి వేదికల మీది నుంచి కూలిపోతాయి. దేవతల కళ్ల ముందర సుగంధ ద్రవ్యాల పరిమళపు మేఘాలు చెల్లాచెదురై పోతాయి. మనిషికి భౌతిక వాస్తవికత గురించి స్ఫురణ కలుగుతుంది. సంఘటనల పరంపర వెనుక అసలు కారణమేమిటో రహస్యం మనిషికి తెలిసిపోతుంది. మానవజీవి తనను తాను తెలుసుకుంటుంది. తన వ్యక్తిగత సంకల్పం విలువేమిటో మనిషికి తెలిసి వస్తుంది. ఆవశ్యకతకు విధేయం కావడం ద్వారా, క్రమశిక్షణ గరపడం ద్వారా ఆ సంకల్పాన్ని మరింత శక్తిమంతం చేసుకోవచ్చునని మనిషికి తెలిసి వస్తుంది. చివరికి ఆ వ్యక్తిగత సంకల్పం ఆవశ్యకత మీద కూడ ప్రాబల్యం వహిస్తుంది. తన సొంత లక్ష్యాలతో మమేకమవుతుంది. మరి ఏ మనిషి తనను తాను తెలుసుకుంటారు? సాధారణంగా ఏ మనిషైనా అని కాదు. ఆవశ్యకత కాడి బరువు మోస్తున్న మనిషికి మాత్రమే ఆ అవకాశం ఉంది. ఈ చరిత్ర సారాంశం కోసం అన్వేషిస్తే, ఆ సారాంశాన్ని ఉత్పత్తి, వినిమయాల వ్యవస్థలలో, సంబంధాలలో గుర్తిస్తే, ఎవరైనా మానవ సమాజం ఎలా రెండు వర్గాలుగా చీలిపోయిందో గుర్తించక తప్పదు. ఉత్పత్తి సాధనాలను సొంతం చేసుకున్న వర్గం ఇప్పటికే తప్పనిసరిగా తానెవరో గుర్తించే ఉంది. తన శక్తి గురించీ, కర్తవ్యం గురించీ దానికొక చైతన్యం ఉంది. కాకపోతే అది గందరగోళ భరితమైనదీ, శకలాల రూపంలో ఉన్నదీ కావచ్చు. దానికి వ్యక్తిగత లక్ష్యాలున్నాయి, వాటిని సాధించడానికి ఉద్దేశపూర్వకంగా, వస్తుగతంగా సంఘటితమయ్యే సామర్థ్యం ఉంది. ఆ లక్ష్యసాధనా మార్గం ఆకలితో చిక్కిన శరీరాలతో, యుద్ధ రంగాలలోని మృత దేహాలతో నిర్మాణ మయ్యిందని దానికి లెక్కే లేదు.


వాస్తవ చారిత్రక మృత జీవులను సంఘటితం చేసే బాధ్యత తన మీద ఉందని మరొక వర్గం గుర్తించడం ఒక జ్ఞానోదయం వంటిది. ఆ గుర్తింపే కాపరి లేని పెద్ద మందను పద్ధతిలో పెట్టే సూత్రంగా మారుతుంది. ఆ క్రమంలో ఆ మంద స్వీయచైతన్యాన్ని పొందుతుంది. తనను తాను ఒక వర్గంగా స్థాపించుకునే ప్రయత్నంలో ఎంతటి కర్తవ్యం దాగి ఉన్నదో అది గ్రహిస్తుంది. తన వ్యక్తిగత లక్ష్యాలను సాధించడానికి అవసరమైన సాధనాలు సంపాదించే వరకూ, ఆ కోరికలు తన సంకల్పంగా మారే వరకూ తన లక్ష్యాలన్నీ ఉత్తి యథాలాపపు బోలుమాటలే, మితిమీరిన ఆకాంక్షలే అవుతాయని ఆ వర్గం చైతన్యం పొందుతుంది.

స్వచ్ఛంద వాదమా – ఆ మాటకు అర్థం లేదు. లేదా దాన్ని యథేచ్ఛా సంకల్పం అనే అర్థంలో వాడుతుండవచ్చు. కాని మార్క్సిస్టు అర్థంలో సంకల్పం అంటే లక్ష్యం గురించిన అవగాహన. ఇంకా స్పష్టంగా చెప్పాలంటే తన సొంత శక్తి గురించి ఖచ్చితమైన పరిజ్ఞానం, దాన్ని కార్యాచరణలో వ్యక్తీకరించే సాధనాల గురించి పరిజ్ఞానం. దాని అర్థమేమంటే, మొట్టమొదట, ఆ వర్గం నిర్దిష్టతను సంతరించుకుంటుంది. విశిష్టమైనదవుతుంది. తన ప్రత్యేక లక్ష్యాలు సాధించడానికి సుదృఢంగా సంఘటిత మవుతుంది. క్రమశిక్షణా యుతమవుతుంది. ఊగిసలాటలకు లోను కాకుండా, పక్కదారి పట్టకుండా ఉంటుంది. దాని అర్థం అది ఒక సుదూర మజిలీ దాకా నేరుగా సరళరేఖలో సాగిపోయే ప్రేరణగా ఉంటుంది. మధ్య దారిలో దారి పక్క పచ్చిక బయలులో అలుపు తీర్చుకోవడానికి ఆగడమో, ఆ పచ్చదనంతో మెత్తనయిన సుహృద్భావ సోదరులు అందించే పానీయం తాగడమో, గౌరవమూ ప్రేమా కలిసిన మృదు భాషణ వినడమో ఏవీ చేయకుండా సాగవలసి ఉంటుంది. కాని మార్క్సిస్టు అర్థంలో అనే మాట అర్థరహితం. ఆ మాటతో సందిగ్ధాలు రావచ్చు. మతి లేని మాటల జల్లు కురియవచ్చు. మార్క్సిస్టు, మార్క్సిస్టు అర్థంలో... వంటి మాటలు ఎందరెందరి చేతుల్లోనో చలామణీ అయి అరిగిపోయిన నాణాల్లా మారిపోయాయి.

మనకు కార్ల్ మార్క్స్ అంటే మానసిక, నైతిక జీవిత మార్గదర్శి. ఒక పంగలకర్ర పట్టుకున్న పశుల కాపరి కాదు. ఆయన మన మానసిక సోమరితనాన్ని వదిలించే ప్రేరకుడు. మన నిద్రాణమైన శక్తులను మేల్కొలిపి, మంచి పోరాటం కొరకు సిద్ధం చేసే వైతాళికుడు. శూన్యంలో, అమూర్తతల గురించి మాట్లాడకుండా ఉండడానికి అవసరమైన స్పష్టమైన భావాల నిజాయితీ, దృఢమైన సంస్కృతి సాధించడానికి ఎంత తీవ్రంగా, పట్టు వదలకుండా పని చేయాలో ఆయనే ఉదాహరణ. తెలుసుకోగలిగిన, ఆలోచించ గలిగిన ఏకశిలా సదృశ మానవమేధ ఆయన. మాట్లాడడానికి ఆయన నాలుక కోసం వెతుక్కోడు. అనుభూతి చెందడానికి ఆయన గుండె మీద చెయ్యి పెట్టుకోడు. కాని ఆయన వాస్తవికతా సారాంశాన్ని చుట్టు ముట్టి, దాన్ని అధీనం చేసుకోగలిగిన ఉక్కు తర్కపు వాదనలను తయారుచేశాడు. ఆ తర్కం ప్రజల మనసులో చొరబడుతుంది. ఆ మనసుల్లో

☞ మిగతా 23వ పేజీలో

# కార్ల్ మార్క్స్ చెప్పిన ఈ నాలుగు సిద్ధాంతాలకు నేటికీ తిరుగులేదు



- మ్యాక్స్ సీత్జ్‌బీసీ ముండో

19వ శతాబ్దంలో జర్మనీకి చెందిన తత్వవేత్త కార్ల్ మార్క్స్ చాలా గ్రంథాలు రాశారు. కానీ ఆయన రాసిన వాటిలో రెండు – 'కమ్యూనిస్టు ప్రణాళిక', 'పెట్టుబడి' – ఒక సమయంలో ప్రపంచంలోని చాలా దేశాల్లోని కోట్లాది మంది ప్రజలపై ఇవి రాజకీయంగా, ఆర్థికంగా చాలా ప్రభావం చూపాయి.

రష్యన్ విప్లవం తర్వాత సోవియట్ యూనియన్ ఆవిర్భావం ఇందుకో ఉదాహరణ. 20వ శతాబ్దపు చరిత్రపై సోషలిస్టు పంథా చూపిన ప్రభావాన్ని ఎవరూ కాదనలేరు.

చివరకు, అనేకానేక పరిణామాల ఫలితంగా సోషలిస్టు శిబిరం కుప్పకూలిపోయింది. పెట్టుబడిదారీవిధానం ఈ భూగ్రహాన్నంతా చుట్టేసింది. అయితే, అలా కమ్యూనిజం విఫలమైనప్పటికీ, నేటికీ ప్రాసంగికతను కోల్పోని మార్క్స్ సిద్ధాంతాలేమిటో ఓసారి చూద్దాం.

## 1. రాజకీయ కార్యక్రమం

కమ్యూనిస్టు ప్రణాళిక, తదితర వ్యాసాల్లో మార్క్స్ పెట్టుబడిదారీ సమాజంలో 'వర్గ పోరాటం' గురించి ప్రస్తావించారు. వర్గ పోరాటం ద్వారానే, చివరకు కార్మికవర్గం మొత్తం ప్రపంచమంతటా బూర్జువా వర్గాన్ని కూలదోసి అధికారాన్ని చేజిక్కించుకుంటుందని ఆయన వివరించారు. తన ప్రఖ్యాత గ్రంథం 'దాస్ కేపిటల్' (పెట్టుబడి)లో ఆయన తన ఈ సిద్ధాంతాలను చాలా వాస్తవికంగా, శాస్త్రీయ దృక్పథంతో విశ్లేషించారు.

'అన్నింటినీ ఆక్రమించుకునే పెట్టుబడిదారీ విధానానికి వ్యతిరేకంగా మార్క్స్ చాలా తాత్వికంగా అనేక వాదనలు లేవనెత్తారు. ఆ విధానం మొత్తం మానవ నాగరికతనే ఎలా బానిసగా మార్చిందో ఆయన తెలియజెప్పారు' అని మార్క్స్ జీవిత చరిత్ర రాసిన బ్రిటన్‌కు చెందిన ఫ్రాన్సిస్ వీన్ అన్నారు.

20వ శతాబ్దంలో కార్మికులు రష్యా, చైనా, క్యూబా, తదితర దేశాల్లో పాలకవర్గంగా ఉన్న వారిని అధికారంలోంచి కూలదోసి, వ్యక్తిగత ఆస్తినీ, ఉత్పత్తి సాధనాలను చేజిక్కించుకున్నారు.

"ప్రపంచీకరణ తొలి విమర్శకుడు మార్క్సే. ప్రపంచ వ్యాప్తంగా పెరిగిపోతున్న అసమానతలపై ఆయన ఆనాడే హెచ్చరించారు" అని బ్రిటన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్‌లో జర్మన్ చరిత్రకారుడు అల్బ్రెఖ్ట్ రిసల్ అంటారు.

2007–08లో ప్రపంచవ్యాప్తంగా వచ్చిన ఆర్థిక మాంద్యం ఆయన సిద్ధాంతాల ప్రాసంగికతను మరోసారి రుజువు చేశాయి.

## 2. పదే పదే మాంద్యం ఏర్పడటం

పెట్టుబడి 'పితామహుడు' ఆడమ్ స్మిత్ తన 'వెల్త్ ఆఫ్ నేషన్స్' పుస్తకంలో రాసిన సిద్ధాంతాలకు భిన్నంగా, మార్కెట్‌ను నడిపించేవి అదృశ్య శక్తులేమీ కాదని మార్క్స్ భావించారు.

మాంద్యం పదే పదే పునరావృతమవుతుందనీ, దానికి కారణాలు పెట్టుబడిదారీ విధానంలోనే ఇమిడి ఉన్నాయని మార్క్స్ చెప్పారు.

"పెట్టుబడిదారీ విధానం అంతరించి పోయేదాకా ఇలాగే జరుగుతుందని మార్క్స్ సూత్రీకరించారు" అని అల్బ్రెఖ్ట్ అంటారు.

ప్రపంచవ్యాప్తంగా 1929లో షేర్ మార్కెట్లు బోర్లా పడి పోయాయి. ఆ తర్వాత కాలంలో 2007–08లో వచ్చిన మాంద్యం మరింత హెచ్చు స్థాయిలో ఉంది. ప్రపంచంలోని విత్త మార్కెట్లన్నీ ఎన్నడూ చూడనంత సంక్షోభంలో కూరుకుపోయాయి. అయితే ఈ సంక్షోభాల ప్రభావం భారీ పరిశ్రమల కన్నా ఆర్థిక రంగం పైనే ఎక్కువ పడిందని విశ్లేషకులంటారు.

## 3. అంతులేని లాభాలు, గుత్తాధిపత్యం

మార్క్స్ చెప్పిన సిద్ధాంతాల్లో కీలకమైంది – 'అదనపు విలువ'. కార్మికుడు తనకు దక్కే కూలీ డబ్బుకు మించి సృష్టించేదే అదనపు విలువ.

మార్క్స్ అభిప్రాయం ప్రకారం, ఉత్పత్తి సాధనాల యజమానులు ఈ అదనపు విలువను కాజేస్తారు. కార్మిక వర్గాన్ని అట్టడుగు స్థానానికి తొక్కి వేస్తూ లాభాల మీద లాభాలు పోగు చేసుకుంటారు. ఈ విధంగా పెట్టుబడి అంతా కొద్ది మంది చేతుల్లో కేంద్రీకృతమవుతుంది. దీని వల్ల నిరుద్యోగం పెరుగుతుంది. వేతనాలు పడిపోతుంటాయి. దీన్ని మనం నేటికీ చూస్తూనే ఉన్నాం.

బ్రిటిష్ పత్రిక 'ది ఎకానమిస్ట్'లో వచ్చిన ఇటీవలి విశ్లేషణ ప్రకారం, గత రెండు దశాబ్దాల్లో అమెరికా వంటి దేశాల్లో వేతనాలు గిడసబారిపోయాయి. అంటే, ఏ మాత్రం పెరుగుదల లేదు. కానీ, అధికారుల వేతనాల్లో మాత్రం 40 నుంచి 110 రెట్ల వృద్ధి నమోదైంది.

## 4. ప్రపంచీకరణ, అసమానత్వం

అయితే, పెట్టుబడిదారీ విధానం తన గొయ్యిని తానే తవ్వుకుంటుందని మార్క్స్ రాసిన మాట నిజం కాలేదని మార్క్స్ జీవిత చరిత్ర రచయిత ఫ్రాన్సిస్ వీన్ అన్నారు. సరిగ్గా ఇందుకు భిన్నంగా జరిగింది. కమ్యూనిజం అంతరించిపోయింది. మరోవైపు పెట్టుబడిదారీ వ్యవస్థ సర్వవ్యాపితమైంది.

మార్క్స్ చెప్పిన జోస్యం ఫలించకపోవచ్చు గానీ పెట్టుబడిదారీ ప్రపంచీకరణపై ఆయన చేసిన విమర్శలో మాత్రం ఏ మాత్రం తప్పులేదు.

పెట్టుబడిదారీ ప్రపంచీకరణే అంతర్జాతీయ అస్థిరత్వానికి ప్రధాన కారణమవుతుందని ఆయన 'కమ్యూనిస్టు ప్రణాళిక'లో పేర్కొన్నారు. 20, 21వ శతాబ్దాల్లో చోటు చేసుకున్న ఆర్థిక సంక్షోభాలు దీన్ని రుజువు చేశాయి కూడా.

ఈ కారణంగానే, ప్రపంచీకరణ ఫలితంగా తలెత్తుతున్న సమస్యలపై నేడు జరుగుతున్న చర్చలో మార్క్సిజం ప్రస్తావన పదే పదే వస్తూ ఉంటుంది. ❑

---

## మన మార్క్స్

(21వ పేజీ తరువాయి)

పేరుకుపోయి ఉన్న దురభిప్రాయాల, స్థిరాభిప్రాయాల మేటలను కూల్చివేస్తుంది. నైతిక స్వభావాన్ని బలోపేతం చేస్తుంది.

మనకు కార్ల్ మార్క్స్ అంటే కూనిరాగాలతో ఏడుస్తున్న శిశువు కాదు. పూజారులను బెదరగొట్టే గడ్డపు మనిషి కాదు. ఆయన జీవిత చరిత్రలోని అనేక గాథలలో ఏ ఒక్క దానికీ చెందినవాడు కాడాయన. బైటికి కనబడే ఆ మానవ జంతువుకు చెందిన ఎంత ప్రతిభా లేదా ఎంత మొరటుదనమూ ఆయనవి కావు. ఆయన ఒక విశాల గంభీరమైన ఆలోచనాత్మక మేధ. తన అస్తిత్వమేమిటో, తన పర్యవసానమేమిటో, తానేమిటో ఏమి కానున్నదో అనే చైతన్యాన్ని గ్రహించడానికి మానవజాతి వందల సంవత్సరాలుగా సాగిస్తున్న ఉద్వేగపూరిత అన్వేషణలో ఒకానొక వ్యక్తిగత సందర్భం ఆయన. నిగూఢమైన చరిత్ర లయను గ్రహించడానికి, ఆ గుట్టు విప్పి చెప్పడానికి, తన ఆలోచనలో మరింత శక్తిమంతంగా ఉండడానికి, మరింత మెరుగ్గా ఆచరణ సాగించడానికి మానవ జాతి చేస్తున్న అన్వేషణలో ఒక సందర్భం ఆయన.

ఆయన ఒక మననంలో ఒక అత్యవసరమైన, అంతర్గర్భితమైన భాగం. ఆయననేవాడు జీవించి ఉండకపోతే, ఆలోచించి ఉండకపోతే, తన ఉద్వేగాలకూ భావాలకూ మధ్య, అనుభవించిన కడగండ్లకూ పెట్టుకున్న ఆదర్శాలకూ మధ్య రాపిడిలో నిప్పురవ్వలు రగిలించి వెలుగులు వెదజల్లి ఉండకపోతే మన మానసిక స్ఫూర్తే ఉండేది కాదు.

శతజయంతి సందర్భంగా కార్ల్‌మార్క్స్‌ను కీర్తించడంలో అంతర్జాతీయ కార్మికవర్గం తనను తాను కీర్తించుకుంటున్నది. తన చైతన్య పూర్వకమైన శక్తినీ, తన విజయావేశపు భావోద్వేగాన్ని కీర్తించుకుంటున్నది. ఆ విజయం ఆధిపత్యవర్గాల పాలనను కూలదోస్తుంది. తన ప్రయత్నాలకూ, త్యాగాలకూ శిఖరామానమైన అంతిమ పోరాటానికి సన్నద్ధం చేస్తుంది. ❑


**– వీక్షణం మాసపత్రిక సౌజన్యంతో...**

# 21వ శతాబ్దపు సోషలిజం ఎటువంటిది ?

మైఖేల్. ఎ.లెబోవిజ్

సంక్షిప్త సరళానువాదం : రావు కృష్ణారావు

ఏదైనా ఒక విషయాన్ని అర్ధం చేసుకోవడానికి అది ఏమి కాదో తెలుసుకోవడం మంచి పద్దతి. మానవ అవసరాలు తీర్చడానికి కాక తమ లాభాలే లక్ష్యంగా కొంతమంది పై నుండి ఆదేశాలిస్తుంటే పని చేయడానికి తమ పని సామర్ధ్యాలను అమ్ముకొనే ప్రజలుండే సమాజం కాదు 21వ శతాబ్దపు సోషలిజం. వేతనాలు తగ్గించడానికి , పని సాంద్రత పెంచడానికి అంటే దోపిడీ పెంచడం ద్వారా లబ్ధి పొందడానికి ఉత్పత్తి సాధనాల యజమానులు శ్రామికులను, ప్రజా సమూహాలను విభజించే సమాజం కాదు. క్లుప్తంగా చెప్పాలంటే 21 శతాబ్దపు సోషలిజం అంటే కాపిటలిజం కాదు.



అలాగే అది పైన నిర్ణయాలు తీసుకొని క్రింద అమలుచేసే, తీసుకోవాల్సిన చొరవలన్నీ రాజ్యాధికారులు లేదా స్వీయ పునరుత్పత్తి చేసుకొనే వేన్ గార్డ్ కార్యకర్తల ఆస్తి అయిన స్టాటిస్ట్ (STATIST) సమాజం కూడా కాదు. సమాజానికి పైన, దానికి అతీతంగా నిలుస్తూ సజీవ పౌర సమాజాన్ని కొండచిలువలా చుట్టి పిప్పి చేసే రాజ్యాన్ని 21వ శతాబ్దపు సోషలిజం తిరస్కరిస్తుంది. అలాగే 21వ శతాబ్దపు సోషలిజం అంటే పాప్యులిజం (Populism) కూడా కాదు. పాప్యులిస్టు సమాజంలో ప్రజలు తమకు వనరులు, తమ సమస్యలన్నింటికి సమాధానాల కోసం రాజ్యం వైపు చూస్తారు. అది ప్రజలను ప్రతి విషయానికి రాజ్యం వైపు, అన్నింటిని వాగ్దానం చేసే నాయకుల వైపు చూసే వారిగా మిగులుస్తుంది.

అంతేకాదు 21వ శతాబ్దపు సోషలిజం నియంతృత్వం కాదు. అది ఉత్పాదక కార్యకలాపాల్లోను, వినిమయ అభిరుచుల్లోను, జీవనరీతుల్లోను ఏక రూపతను డిమాండు చేసే రాజ్యం కల సమాజం కాదు. మరీ ముఖ్యంగా 21వ శతాబ్దపు సోషలిజం వ్యక్తిగత విశ్వాసాలను శాసించదు. ఉదాహరణకు రాజ్య మతాన్ని గాని, రాజ్య నాస్తికత్వాన్ని గాని రుద్దదు. అలాగే 21వ శతాబ్దపు సోషలిజం సాంకేతిక పరిజ్ఞానాన్ని, ఉత్పత్తి శక్తులను ఆరాధించదు. సోవియట్ యూనియన్లో వీటి సంకేతారాధన భారీ పరిశ్రమలు, గనులు, సమిష్టి వ్యవసాయ క్షేత్రాలకు దారి తీసి మన ఉమ్మడి ఆవాసమైన భూమిని ధ్వంసం చేసింది.

### కీలకమైన లింకు :

అందుచేత 21వ శతాబ్దపు సోషలిజం అంటే ఏమిటో వివరించుకుందాం! 20వ శతాబ్దపు అనుభవాల నుండి నేర్వవలసిన పాఠాలున్నాయి. 1999లో ఆమోదించిన బొలివేరియన్ రాజ్యాంగం ఈ పాఠాల్లో చాలా వాటిని ప్రతిబింబిస్తుంది. ఆర్టికల్ 299 లో "మానవాళి సమగ్ర అభివృద్ధికి పటిష్ట హామీనివ్వడం" లోను, ఆర్టికల్ 20లో తన సొంత వ్యక్తిత్వాన్ని అభివృద్ధి చేసుకొనే హక్కు ప్రతి ఒక్కరికీ వుందని ప్రకటించడం, అలాగే ఆర్టికల్ 102 లో ప్రతి మానవ వ్యక్తి తన సృజనాత్మక శక్తిని అభివృద్ధి చేసుకోవడం, ప్రజాస్వామ్య సమాజంలో తన వ్యక్తిత్వాన్ని ఆచరించే, ప్రదర్శించే అవకాశముండటం, దాంతో బాటు ఆర్టికల్ 62 లో 'ప్రజలు పాల్గొనడం వ్యక్తి, సమిష్టి సమగ్రాభివృద్ధికి హామీనిచ్చే ఆవశ్యక

మార్గం' మొ..ప్రకటనల్లో ఈ పాఠాలు స్పష్టంగా కనిపిస్తాయి. అన్ని సామాజిక స్థాయిలలోనూ ప్రజాస్వామ్యయుత ప్రణాళిక, ప్రజలు పాల్గొనే బడ్జెట్ తయారీలో ఈ పాఠాలు వ్యక్తమవుతాయి. "పరస్పర సహకారం, సౌభ్రాతృత్వం మార్గదర్శిగా స్వీయ నిర్వహణ, సహ నిర్వహణ అన్ని రూపాల్లో సహకార సంస్థల" ను 70 వ ఆర్టికల్ వక్కాణించడంలో ఇవి కనిపిస్తాయి. చివరగా ఆర్టికల్ 135 'సౌభ్రాతృత్వం, సామాజిక బాధ్యత, మానవతావాద సహాయం అనేవి వారి వారి సామర్థ్యాన్ని బట్టి ప్రతి పౌరుని బాధ్యత" అని నిర్దేశిస్తుంది.

ఈ సోషలిజం భావనను మరింత లోతుగా అర్థం చేసుకోవడానికి మనం మానవాభివృద్ధిపై మార్క్సు కేంద్రీకరణకు వెనక్కు మళ్ళాల్సి వుంటుంది. తన 1844 రాత ప్రతుల్లో మార్క్సు 'సంపద్వంతమైన మానవుడు' అనే భావనను ప్రవేశపెట్టాడు. ఏ స్థాయి వద్ద బహుముఖ మార్గాల్లో ఇష్ట సిద్ధి సాధించగలడో ఆ స్థాయికి తన సామర్థ్యాలు అభివృద్ధి చేసుకున్న వ్యక్తి, ఆర్థిక సంపద లేదా బీదరికం స్థానంలో అతని స్వీయసిద్ధి ఒక అంతర్గత ఆవశ్యకతగా అతనిలోనే ఒక అవసరమై వుంటుందో అటువంటి వ్యక్తి సంపద్వంతమైన మానవుడు. అతని అవసరం (need) సంపద్వంతమైన (rich) మానవ అవసరం.

క్లుప్తంగా చెప్పాలంటే నిజమైన సంపద భౌతిక ఆస్తులను ప్రోగు చేసుకోవడం కాదు. మానవ సామర్థ్యం అభివృద్ధి చెందడం. గ్రుండ్రిస్సెలో "వైయక్తిక అవసరాలు, సామర్థ్యాలు, ఆనందాలు, ఉత్పాదక శక్తులు మొ.. వాటి సార్వత్రికత కాక సంపద అంటే వేరే ఏమిటి ?" అని మార్క్స్ ప్రశ్నించాడు. అందుకనుగుణంగా ఆయన వినిమయం ఎంత బహుముఖీయంగా ఉంటుందో అంతే బహుముఖీయమైన ఉత్పత్తి (సామర్థ్యం) కల సంపద్వంతమైన వ్యక్తిత్వ ప్రాధాన్యతను వక్కాణించాడు. సోషలిజం గురించి మార్క్సు భావన ఏమిటంటే మానవుల సమగ్ర అభివృద్ధికి గల అడ్డంకులన్నింటినీ తొలగించే సమాజాన్ని సృష్టించడం. ఇదే విషయాన్ని ఆయన కాపిటల్‌లో కూడా చెప్పాడు. పెట్టుబడి కోసం, దాని పెరుగుదల కోసం శ్రామికుడుండే సమాజానికి విరుద్ధంగా "వస్తు సంపద శ్రామికుని సొంత అభివృద్ధి అవసరాలకై ఉండవలసిన 'తలక్రిందుల వ్యవస్థను సరిచేసిన' పరిస్థితిని" ఆయన ప్రతిపాదించాడు.

శ్రామికుని స్వీయ అభివృద్ధి అవసరం అంటే ఏమిటో చూద్దాం. తిరిగి సరిగా నిలిపిన అటువంటి పరిస్థితిలో ప్రతీ వ్యక్తీ అతని లేదా ఆమె యొక్క పూర్తి శక్తి సామర్థ్యాలను అభివృద్ధి చేసుకోగలుగుతారు. అంటే అతని/ఆమె పూర్తి సృజనాత్మక శక్తి సామర్థ్యాలను సంపూర్ణ వినియోగంలోకి తేగలుగుతారు. మానవ శక్తుల అభివృద్ధి అనేది దానికదే లక్ష్యం అవుతుంది. ఇవి ప్రజల ఉత్పత్తి శక్తులు, వ్యక్తి సమగ్ర అభివృద్ధితోను, సహకార సంపద మరింత సమృద్ధంగా ప్రవహించడంతోనూ పెరిగినవి. సంపద్వంతమైన మానవులు ఈ సరిగా నిలిపిన పరిస్థితికి ప్రాతిపదిక, దాని ఫలితం కూడా.

అయితే సంపద్వంత మానవులు ఎలా తయారవుతారు? ప్రతి ఒక్కరూ వారి శక్తి సామర్థ్యాలను సంపూర్ణంగా అభివృద్ధి చేసుకొనే అవకాశాలను ఎలా కలిగిస్తాం? ఇదేదో పై నుండి బహుమానాలివ్వడం ద్వారా కాదు. ఈ విషయంలో మార్క్సు చాలా స్పష్టంగా వున్నాడు. థీసిస్ ఆన్ ఫొయర్ బాక్ లో కొత్త నిర్మాణాలను, సమూహాలను ఏర్పరచి పరిస్థితులను మార్చడం ద్వారా మాత్రమే ప్రజలను మార్చలేమని నొక్కి చెప్పాడు. అందుకు విరుద్ధంగా నిజానికి ఉన్న మానవులే పరిస్థితులను మారుస్తారని, ఆ ప్రక్రియలో తమను తాము మార్చుకుంటారని వాదించాడు. ఇది విప్లవాత్మక ఆచరణ. అంటే పరిస్థితుల్నీ, మానవ కార్యాచరణను ఏక కాలంలో మార్చడం లేదా స్వీయ మార్పు.

సంపద్వంత మానవుల లక్ష్యానికి సంబంధించి ఆచరణ ద్వారా మానవాభివృద్ధి అనే కీలక భావనను మార్క్స్ తన 1844 రాత ప్రతుల్లోనే ప్రతిపాదించాడు. కార్యాచరణ (భావరూప కార్యాచరణ మాత్రమే) పై హెగెల్ కేంద్రీకరించడం గురించి వ్యాఖ్యానిస్తూ వాస్తవ, నిర్దిష్ట మానవులు తమను తాము ఉత్పత్తి చేసుకొనే ఏకైక మార్గం (విధానం) మానవ కార్యాచరణే నని మార్క్స్ పదే పదే ఉద్ఘాటించాడు. అలాగే వాస్తవ (నిజమైన) మానవుడు తన సొంత శ్రమ ఫలితమేనని విస్పష్టంగా ప్రకటించాడు. ఈ విధంగా ఏకకాలంలో పరిస్థితులను మార్చడం, స్వీయ మార్పు అనే భావన మార్క్సు సిద్ధాంతమంతట్లోను దండలో దారంలా వుంటుంది. ఉదాహరణకు గ్రుంట్ రిస్సెలో మార్క్సు ఇలా చెబుతాడు. తమలోని కొత్త గుణాలను వెలికి తీసుకురావడం ద్వారా ఉత్పత్తిదారులు కూడా మారుతారు.

ఉత్పత్తిలో తమని తాము అభివృద్ధి చేసుకుంటారు. వారిని వారు రూపాంతరీకరించు కుంటారు. కొత్త శక్తులను, కొత్త భావాలను అభివృద్ధి చేసుకుంటారు. కొత్త పరస్పర చర్యా విధానాలను, కొత్త అవసరాలను, కొత్త భాషను అభివృద్ధి చేసుకుంటారు.

విప్లవాత్మక ఆచరణను, మానవాభివృద్ధిని కలిపే లింకు విస్పష్టం. అది పరిస్థితులను, మనుషులను రూపాంతరించి కొత్త ప్రపంచాన్ని సృష్టించేందుకు తగిన వారిగా శ్రామికులను తీర్చిదిద్దేటటు వంటి శ్రామికుల పెట్టుబడి వ్యతిరేక పోరాటంలో కూడా స్పష్టంగా కనిపిస్తుంది. ఎంగెల్సు ఇలా చెప్పాడు. అటువంటి పోరాటాల ద్వారా శ్రామికుడు తాను గతంలో ఉన్నట్లు ఉండడు. "ఆ పోరాటం పూర్తయిన తర్వాత మొత్తం శ్రామిక వర్గం ఆరంభంలో ఉన్నదాని కంటే వందరెట్లు బలంగా, మరింత వివేకవంతంగా, మరింత వ్యవస్థీకృతంగా వుంటుంది". అదే విధంగా మార్క్సు వేతనాల కోసం శ్రామికుల పోరాటాలు వారు ఉదాసీనంగా, ఆలోచనారహితంగా, అంతకు మించి మంచి మేత పెట్టే ఉత్పత్తి సాధనాలుగా తయారు కాకుండా ఆపుతాయని, అవి లేకుంటే శ్రామికులు గుండె పగిలిన, బలహీన మనస్కమైన, శిధిలమైన ప్రతిఘటించని ఒక ప్రజా బాహుళ్యంగా మారతారనీ చెబుతాడు.

మానవాభివృద్ధికి, ఆచరణకు మధ్య మార్క్సు చెప్పిన అతి కీలక లింకు ఇదే ! మనం పాత భావాలకే బందీలై వారసత్వంగా వచ్చిన సంస్కృతి చేత తీర్చిదిద్దబడుతూ వుండవచ్చు. లేదా మన నాయకత్వం ద్వారా మనల్ని మనం కొత్త ప్రజగా నిర్మించుకోవచ్చు. బొలివేరియన్ రాజ్యాంగం గుర్తించినట్లుగా మానవాభివృద్ధి, ఆచరణలను విడదీయ వీలులేదు. ప్రజలు వ్యక్తిగతంగా, సమిష్టిగా సమగ్రాభివృద్ధి చెందడానికి ప్రజల నాయకత్వం ఆవశ్యకం.

## పెట్టుబడిదారీ సంబంధాల్లో రెండవ ఉత్పాదితం

మార్క్సు చెప్పిన కీలక లింకును మనం గ్రహించినట్లైతే ప్రతీ మానవ కార్యాచరణ రెండు ఉత్పాదితాలను (ఫలితాలను) కలిగి వుంటుందని మనకు అర్థం అవుతుంది. ఒకటి పరిస్థితుల్లో మార్పు అయితే రెండోది స్వీయ మార్పు. భౌతిక వస్తువు ఉత్పత్తితో బాటు ఎల్లప్పుడూ రెండవ మానవ ఉత్పాదితం వుంటుంది. దురదృష్టవశాత్తు ఈ రెండవ ఉత్పాదితాన్ని (మానవుడిని) తరచూ విస్మరిస్తుంటాం.

దీన్నిబట్టి మనం అరుదుగా అడిగే ఒక ప్రశ్న అడగాల్సి వుంది. శ్రామికునిలో వచ్చే మార్పులు ఏమిటి ? పని చేసే చోట ఎటువంటి ప్రజలు తయారవుతున్నారు? దీనికి సమాధానం సందర్భాన్ని బట్టి వుంటుంది. అంటే ఉత్పత్తి ప్రక్రియలో సంబంధాల స్వభావాన్ని బట్టి వుంటుంది. తగిన పరిస్థితుల్లో ఈ రెండవ ఉత్పాదితం సానుకూలంగా వుండవచ్చు. కాని పోరాడటంలో కార్మికులు విఫలమవ్వడం గురించి చర్చించే సందర్భంగా మార్క్సు భావించినట్లు ఈ రెండవ ఉత్పదితం ప్రతికూలంగా వుండవచ్చు.

పెట్టుబడిదారీ ఉత్పత్తి సంబంధాలలో ఏమి జరుగుతుందో చూద్దాం! పెట్టుబడిదారీ వ్యవస్థలో పనిస్థలంలో ప్రజలు తమకోసం కాక, బయటి వ్యక్తి ప్రయోజనం కోసం శక్తివంతమైన అతని ఇచ్చను బట్టి పని చేయవలసిన పరిస్థితికి గురవుతారు. పెట్టుబడికి ఇలా అధీనమై పని చేయడం శ్రామికుని దుర్భలున్ని చేసి విరూపం చేస్తుంది. మార్క్సు కేపిటల్‌లో శ్రామికుడు ఎలా విచ్చిన్న మవుతాడో, దరిద్రుడవుతాడో, అతని శరీరం, మనసు ఎలా దుర్భలమవుతాయో వర్ణించాడు. జీవితాంతం ఒకే రకమైన ప్రత్యేకీకృత పని చేయడానికి అతని కాళ్ళు, చేతులూ ఎలా బంధింపబడతాయో చెప్పాడు. ఇది పెట్టుబడిదారీ ఉత్పత్తి ప్రక్రియ ముఖ్య లక్షణమైన శ్రమ విభజన వల్ల జరుగుతుంది. పెట్టుబడిదారీ విధానంలో యంత్రాల అభివృద్ధి శ్రామికులను రక్షిస్తుందా ? రక్షించదు. అది ఉత్పత్తి ప్రక్రియ యొక్క మేధోనైపుణ్యాలను శారీరక శ్రమను వేరు చేయడాన్ని పూర్తి చేస్తుందని మార్క్సు చెప్పాడు. క్లుప్తంగా చెప్పాలంటే అది శరీరం, మనసులను బలహీన పరచడాన్ని పూర్తి చేస్తుంది.

ఇటువంటి పరిస్థితుల్లో చేయి, మెదడు వేరుపడి శత్రువులవుతాయని, శారీరక, మేధో కార్యకలాపాల్లో స్వేచ్ఛ యొక్క ప్రతి అణువునూ కోల్పోవడం జరుగుతుందని మార్క్సు వివరిస్తాడు. ఉత్పత్తి అభివృద్ధికి సంబంధించిన సాధనాలన్నీ గతితార్కిక విలోమానికి గురవుతాయంటాడాయన. అవి కార్మికుని ఒక మానవ శకలం (fragment) గా చేస్తాయి. అవి అతన్ని

హీనపరచి అతనిలోని శ్రమ ప్రక్రియ యొక్క మేధో శక్తులను అతన్నుండి పరాయీకృతం (వేరు) చేస్తాయని మార్క్స్ వివరించాడు.

క్లుప్తంగా చెప్పాలంటే మానవుల సర్వతోముఖాభివృద్ధిని ఉత్పత్తి చేయడానికి బదులు పెట్టుబడి శ్రామికులను శకలాలుగా విరూపం చేస్తుంది. సంపద్వంతమైన మానవులను ఉత్పత్తి చేయడానికి బదులు పెట్టుబడిదారీ ఉత్పత్తి శ్రామికులను పూర్తి రిక్తం చేయడాన్ని, పూర్తి పరాయీకరణను తప్పనిసరి చేస్తుంది. పెట్టుబడిదారీ ఉత్పత్తి ద్వితీయ ఉత్పాదితం శకలీకృత, నిర్బలీకృత మానవుడు. అతని సుఖం అంతా వస్తువులను కలిగి ఉండటం, వినిమయాలలో మాత్రమే ఉంటుంది. అతనొక దరిద్రుడు.

## పెట్టుబడిదారీ తల క్రిందులతనాన్ని సరిచేయడం

పెట్టుబడిదారీ విధానం ప్రతీదాన్నీ తలక్రిందులు చేస్తుందని మార్క్స్ వక్కాణించాడు. పెట్టుబడిదారీ ఉత్పత్తి సంబంధాల ముఖ్య లక్షణం ఏమంటే ఉత్పత్తి సాధనాలను కార్మికుడు ఉపయోగించక పోగా ఉత్పత్తి సాధనాలే కార్మికుడ్ని ఉపయోగిస్తాయని చెబుతాడాయన. వేరే సందర్భంలో ఈ తలక్రిందులుతనాన్ని గురించి చెబుతూ "అతని పని పరిస్థితులను కార్మికుడు నిర్ధారించకపోగా పని పరిస్థితులే కార్మికుడ్ని నియుక్తం చేస్తాయి" అంటాడాయన. ఇంకా ఆయనిలా చెబుతాడు. ఈ తలక్రిందులతనం అంటే వక్రీకరణ, పెట్టుబడిదారీ ఉత్పత్తికి ప్రత్యేకమైన ముఖ్య లక్షణం. మృత శ్రమకు సజీవ శ్రమకూ మధ్య సంబంధం. విలువకూ, ఆ విలువను సృష్టించే శక్తికి మధ్య సంబంధం. కర్తలు వస్తువులుగా సాధనాలు లక్ష్యాలుగా మారి పోతాయి. ఉత్పత్తి అభివృద్ధి యొక్క సాధనాలన్నీ ఉత్పత్తి దారులను దోపిడీ చేసే సాధనాలుగా, వారిని అణచివేసే సాధనాలుగా గతి తార్కిక విలోమానికి లోనౌవుతాయనే నిర్ధారణ చేశాడు మార్క్స్.

ఇందుకు విరుద్ధంగా మార్క్స్ ఈ తలక్రిందుల పరిస్థితిని సరిచేసిన పరిస్థితిని సంభావించాడు. అందులో ఉత్పత్తిని అభివృద్ధి చేసే సాధనాలు ఆధిపత్య, దోపిడీ సాధనాలుగా ఇంకెంత మాత్రం వుండవు. శ్రామికుని స్వీయాభివృద్ధికి అభిముఖమైన సమాజాన్ని నిర్మించడానికి మనం పెట్టుబడిదారీ వ్యవస్థను తిరిగి తన కాళ్ళపై నిలిపి తీరాలి. పెట్టుబడిదారీ ఉత్పత్తికి ప్రత్యేకమైన, ముఖ్య లక్షణమైన ఈ వికృతత్వాన్ని అంతమొందించి తీరాలి. అలా చేయడంలో మనం ఉత్పత్తిదారుల దుర్బలీకరణ, శకలీకరణలను అంతమొందించి, ఉత్పత్తిదారులు తమ సామర్థ్యాలను అభివృద్ధి చేసుకోగల పరిస్థితులను సృష్టిస్తాం. ఈ పరిస్థితుల్లో ఉత్పత్తి కార్యకలాప ద్వితీయ ఉత్పాదితం సంపద్వంతుడైన మానవుడు.

మార్క్స్ ప్రకారం పెట్టుబడిదారి సంబంధాల్లో కార్మికుడు వాస్తవానికి తన పని యొక్క సామాజిక లక్షణాన్ని, దాన్ని ఉమ్మడి లక్ష్యం కోసం ఇతరుల పనితో సమ్మిళితం చేయడాన్ని తనకు పరాయిదైన ఒక శక్తిగా పరిగణిస్తాడు. పెట్టుబడిదారీ తల క్రిందులత్వాన్ని తిరిగి సరిచేయడం (అంటే ఒక ప్రత్యేక నెగేషన్ యొక్క నెగేషన్)తో సహకారయుత ఉత్పత్తిదారులు వారి బహురూప శ్రమశక్తిని పూర్తి స్వీయ ఎరుకతో ఒకే ఒక సామాజిక శ్రమ శక్తిగా వినియోగిస్తారని చెబుతాడాయన. తిరిగి సరిగా నిలిపిన పరిస్థితుల్లో కార్మికులు బలహీనులవడానికి బదులు తమ సామర్థ్యాలను పెంచుకుంటారు. శ్రామికుడు ప్రణాళికాబద్ధమైన మార్గంలో ఇతరులతో కలిసి పని చేసినపుడు అతని వ్యక్తిత్వ సంకెళ్ళను త్రెంచుకొని తన జాతి (species) సామర్థ్యాలను పెంచుకుంటాడని మార్క్స్ చెబుతాడు.

మార్క్స్ అభిప్రాయంలో పెట్టుబడిదారీ శ్రమ విభజనను సరిగా నిలపడం (లేదా తిరిగి విలోమం చేయడం) అత్యంతావశ్యకం. ఈ శ్రమ విభజన శ్రామికుల మనసులను, శరీరాలను వికలం గావించి వారిని శ్రమ ప్రక్రియ యొక్క మేధో శక్తి సామర్థ్యాల నుండి పరాయి వారిని గావించే గతితార్కిక విలోమం. తిరిగి సరిగా నిలిపిన పరిస్థితుల్లో ఉత్పత్తిదారులు కలిసి ప్రణాళికలు వేస్తారు. ఆలోచన, ఆచరణల మధ్య విభజనను అంతం చేస్తారు.

తన ' గోథా కార్యక్రమంపై విమర్శ' లో మార్క్స్ వ్యక్తిని శ్రమ విభజనకు బానిసను చేయడం ద్వారా మానసిక శారీరక శ్రమల మధ్య వైరుధ్యం ఏర్పడుతుందని చెప్పాడు. దీన్ని అంతం చేయడం ద్వారా ద్వితీయ ఉత్పాదితం వక్రీకృతమైన మానవ శకలం కాక సంపద్వంత మానవుడు కావచ్చు. ఆలోచన, ఆచరణల మధ్య విభజనను అంతం చేయడానికి పని స్థలంలో విద్యను ప్రవేశ పెట్టాలని మార్క్స్ సూచించాడు. దీని

ప్రాధాన్యతను ఆయన ఎందుకు అంతగా వక్కాణించాడంటే కేవలం ఉత్పత్తి సామర్థ్యం పెంచడానికే కాక, పూర్తిగా అభివృద్ధి చెందిన మానవులను ఉత్పత్తి చేయడానికి ఇది ఒక్కటే మార్గమని వాదించాడు.

## పాత సమాజాన్ని ఆధీనంలోకి తెచ్చుకోవడం

అయితే ఒక సజీవ వ్యవస్థ ఆకాశం నుండి ఊడిపడదు. ఒక కొత్త వ్యవస్థ పుట్టుకతోనే తన సొంత పునాదులను ఉత్పత్తి చేయలేదు. పాత దాని పునాదులే దానికి వారసత్వంగా లభిస్తాయి. అందుచేత ప్రతీ కొత్త వ్యవస్థ పుట్టుకతో లోప భూయిష్టం.

ఆర్థికంగా, నైతికంగా మేధోపరంగా ఇలా ప్రతి అంశం లోనూ అది పాత వ్యవస్థ పుట్టుమచ్చలను కలిగి వుంటుందంటాడు మార్క్సు. పాత సమాజంలో ఘటకాంశాలన్నింటిని తన ఆధీనంలోకి తెచ్చుకోవడం లేదా లోపించిన అవయవాలన్నింటినీ సృష్టించుకోవడం ద్వారా కొత్త వ్యవస్థ అభివృద్ధి చెందుతుంది. ఈ విధంగా అది చారిత్రకంగా సమగ్రమవుతుంది అంటాడాయన.

తనకు వారసత్వంగా లభించిన పాత సమాజపు లోపాలవల్ల సోషలిజం తన సొంత పరిస్థితులను సృష్టించుకుంటూ సాగాలి. అయితే ఈ ప్రక్రియను ప్రభావితం చేసే అంశాలు చాలా వుంటాయి. ప్రతీ సమాజం దానికే సొంతమైన చరిత్ర, ఆర్థికాభివృద్ధి స్థాయి, అంతర్గత శక్తుల సంబంధాలు కలిగి వుంటాయి. ఆరంభ స్థానం భిన్నమైనదవడం వల్ల లక్ష్యం చేరుకొనే మార్గాలు కూడా భిన్నంగా వుంటాయి. సోషలిజానికి ఒకే మార్గం ఉందనడం "అసాధ్యమైన మార్క్సిస్టు పాండిత్య ప్రకాండత్వం" అని 1923 లో లెనిన్ వాదించాడు.

పెట్టుబడిపాలన అంతం చేయడానికి రాజ్యాన్ని పెట్టుబడి నుండి లాగి పారేయాలి. అంటే పోలీసు, న్యాయ వ్యవస్థ, సైన్యం, చట్టసభలు తదితర అణచివేత యంత్రాంగాలను పెట్టుబడి అదుపాజ్ఞల నుండి వేరు చేయాలి. రాజ్యాధికారాన్ని పెట్టుబడి నుండి తొలగించకుండా పెట్టుబడిని ఏమీ చేయలేం. ప్రజాస్వామ్యానికై జరిగే యుద్ధంలో గెలవాలంటే, కార్మికవర్గం పాలక వర్గ స్థాయికి ఎదగడమే విప్లవం యొక్క మొదటి అడుగు అవ్వాలి అని మార్క్సు ఎంగెల్సులు చెప్పారు. పాత సమాజం నుండి వారసత్వంగా వచ్చిన లోపాలను వెనువెంటనే సవరించ నారంభించాలని మార్క్సు చెప్పాడు.

## 21 వ శతాబ్దపు సోషలిజం ఎందుకు ?

మనం కేవలం 'సోషలిజం' గురించి కాకుండా '21వ శతాబ్దపు సోషలిజం' గురించి ఎందుకు మాట్లాడుతున్నాం? ఎందుకంటే వాటి మధ్య బేధం వుంది. మానవాభివృద్ధి గురించిన మార్క్సు కీలక ఉద్ఘాటన 20వ శతాబ్దపు సోషలిస్టు ప్రయోగాల్లో లోపించింది. మానవాభివృద్ధికి, ఆచరణకు మధ్య గల అతి కీలక లింకు పై కేంద్రీకరణ మాయమయ్యింది. అంటే పరిస్థితులు, స్వీయ మార్పు ఏక కాలంలో జరగడం. అలాగే ప్రత్యేకంగా ద్వితీయ ఉత్పాదితం గురించి అంటే ఒకానొక ప్రత్యేక ఉత్పత్తి సంబంధాలలో ఉత్పత్తి అయ్యే ప్రజల స్వభావం గురించిన సమస్య అంతర్ధానమయ్యింది.

20వ శతాబ్దంలో సోషలిజానికిచ్చిన సైద్ధాంతిక భాష్యం మార్క్సు దృక్పథం నుండి వైదొలగడమే! సోషలిజాన్ని ఒక ప్రక్రియగా కాక తనకున్న విశిష్ట లక్షణాలతో కమ్యూనిజానికి భిన్నమైన ప్రత్యేక దశగా పరిగణించడం జరిగింది. ఇక రెండోది 'నిజమైన సోషలిజం' యొక్క వాస్తవాభివృద్ధి ద్వారా జరిగింది. 20వ శతాబ్దపు ఈ రెండు పెడదారులు సోషలిజాన్ని గురించి ప్రజల అవగాహనను తీర్చిదిద్దాయి.

ఒక ప్రక్రియగా సోషలిజం పై మార్క్సు కేంద్రీకరణ రెండు విషయాలపై శ్రద్ధను కోరుతుంది. అధీనంలోకి తెచ్చుకొని తీరాల్సిన పాత సమాజపు అంశాల గురించి పట్టించుకోవడం, వ్యక్తి, సమిష్టిగా మానవుల సమగ్ర అభివృద్ధి చెందే ప్రక్రియపై దృష్టి పెట్టడం. 'ఒక విశిష్ట దశగా సోషలిజం' బోల్షివిక్కులు అధికారం కోసం జరిపిన పోరాటంలో పుట్టుకు వచ్చి భిన్న ప్రాధాన్యతకు దారి తీసింది. ఆ ప్రాధాన్యాతేమంటే ఉత్పత్తి శక్తుల అభివృద్ధే ముఖ్యమనే వక్కాణింపు.

బోల్షివిక్కులు అవాస్తవిక ఉటోపియన్‌లు అనే విమర్శలు వచ్చినపుడు 1917 లో లెనిన్ 'గోధా కార్యక్రమంపై విమర్శ' లో మార్క్సు చేసిన విభజనకు భాష్యం చెప్పాడు. మార్క్సు చేసిన విభజన పుట్టిన వెంటనే ఆరంభపు కమ్యూనిస్టు సమాజానికి, తన సొంత పునాదులపై నిలచిన ఉన్నత దశకు మధ్య.

మొదటిది సోషలిస్టు దశగా రెండోది అత్యంత భారీగా ఉత్పత్తి శక్తులు అభివృద్ధి చెందిన తరువాత సాధ్యమయ్యే అంతిమ

దశగా ఈ విభజన చేశాడు. ఒకే ప్రక్రియలోని రెండు సందర్భాల మధ్య మార్క్స్ చేసిన విభజన రెండు వ్యవస్థల మధ్య అంటే సోషలిజం, కమ్యూనిజాల మధ్య విభజనగా ఘనీభవించింది. ఈ రెండింటికీ భిన్నమైన వాటి సొంత పంపిణీ సంబంధాలుంటాయి.

కొత్త సమాజం పుట్టినపుడు పాత సమాజపు పుట్టుమచ్చలు కొన్ని ఉంటాయి. అందులో ఒకటి శ్రామికులు శ్రమశక్తి యొక్క వ్యక్తిగత సొంతదారులు/యజమానులుగానే మిగిలి వుంటారు. అందుచేత తమ పనికి తగ్గ ప్రతిఫలాన్ని ఆశిస్తారు. అయితే కొత్త ఉత్పత్తి సంబంధాల అభివృద్ధిపై కేంద్రీకరించడానికి బదులు, తద్వారా ఈ పుట్టుమచ్చను తొలగించే పరిస్థితులను సృష్టించే బదులు, 20వ శతాబ్దపు ఫార్ములా ఈ స్వీయ దృక్పథాన్ని అంగీకరించడమే కాక వారి పనిని బట్టి పంపిణీ చేసే విధానాన్ని నిర్మించారు. ఇదే సోషలిస్టు నియమంగా ప్రసిద్ధమైంది. ఈ దశలో ప్రజలు అంతర్గతంగా స్వీయ దృక్పథం కలిగి వుంటే దానికి అతి ముఖ్య తార్కిక పర్యవసానం ఏమిటంటే వీరు బాగా పని చేయడానికి ఆర్థిక ప్రోత్సాహకాలివ్వడం అవసరం.

కొత్త వ్యవస్థ ఆరంభం నుండీ, అభివృద్ధి చెందే క్రమంలో భిన్నమైన పంపిణీ సూత్రం అమలవ్వాలని కార్ల్ మార్క్స్ వక్కాణించాడు. పనికి తగ్గ ప్రతిఫలం మీద కేంద్రీకరించడాన్ని ఆయన తిరస్కరించాడు. పంపిణీ గురించి హడావుడి చేసి దానికి ప్రధమ ప్రాధాన్యత నివ్వడం పొరపాటని ఆయన చెప్పాడు. మార్క్స్ గోథా కార్యక్రమంపై విమర్శకు 20వ శతాబ్దపు భాష్యకారులంతా సోషలిస్టు దశలో 'పనికి తగ్గ ప్రతిఫలం' అవసరమని నిర్ధారించారు.

## కాపిటలిజం యొక్క మందకొడి సాధనాలతో పరివర్తనా ?

అయితే ఈ సోషలిస్టు సూత్రం పాత సమాజపు ఆర్థిక, నైతిక, మేధో పుట్టుమచ్చలను దాటి కమ్యూనిజపు ఉన్నత దశకు ఎలా చేర్చుతుంది? హక్కు అనేది సమాజ ఆర్థిక నిర్మాణం కంటే ఉన్నతమైనదిగా వుండే వీలు లేనట్లయితే, ఉత్పత్తిదారుల మధ్య ఆర్థిక సంబంధాలను మార్చకుండా సోషలిస్టు మార్గంలో పయనించడం సాధ్యమేనా? 'పాదార్థిక ప్రోత్సాహకాల సాయంతో సోషలిస్టు దశలో ఉత్పత్తి శక్తుల అభివృద్ధి సమృద్ధ స్థితిని సృష్టిస్తుంది. సర్వ సమృద్ధమైన కమ్యూనిస్టు దశలో ప్రజల శ్రమ ఎంత ఎక్కువ ఉత్పాదకమవుతుందంటే వారు స్వచ్ఛందంగా వారి సామర్థ్యాన్ని బట్టి పనిచేస్తారు. అలాగే సమృద్ధత కారణంగా వారి అవసరాలకు కావలసినంత స్వేచ్ఛగా తీసుకుంటారు'. ఇదీ 20వ శతాబ్దపు సమాధానం. క్లుప్తంగా చెప్పాలంటే ఉత్పత్తి శక్తుల అభివృద్ధి వలన ఒక ద్రవం కారినట్లు కొత్త ప్రజ పుట్టుకొస్తారన్న మాట.

అయితే కాపిటలిజం నుండి వారసత్వంగా వచ్చిన ఒక లోపంపై నిర్మించే ప్రయత్నాలతో భవిష్యత్ సమృద్ధ దశను చేరుకోవడం సాధ్యమేనా అనే విషయంలో మార్క్స్ సూచన లభిస్తుందేమో ఎంత వెతికినా దొరకదు. అలా దొరక్కపోగా ఈ పరిస్థితుల్లో ఉత్పత్తి అయ్యే ద్వితీయ ఉత్పాదితం లక్షణం దీనికి వ్యతిరేక దిశను సూచిస్తుంది. శ్రమశక్తి యజమానులైన కార్మికులు తమ ఆస్తిని సమాజంతో మారకం చేసుకునేటప్పుడు వీలైనంత ఎక్కువ పొందాలనుకుంటారు. అంటే వారు శ్రమను వినిమయ వస్తువులను సంపాదించే సాధనంగా చూస్తారు. తమ శ్రమకు తగ్గ ఫలితం రావడం లేదనిపించినపుడు వారు తక్కువ శ్రమిస్తారు. పరాయివైన వస్తువులను సంపాదించడానికి పరాయిదైన శ్రమ, సామాజిక యాజమాన్యంలో భౌతిక ఉత్పత్తి పరిస్థితులనుండి పరాయీకరణ, అందుచేత మరింత ఎక్కువ పొందడానికి వాటి దొంగతనం. ఇలాంటి పరిస్థితుల్లో సమృద్ధత ఎప్పటికైనా సాధ్యమేనా? పరాయిదైపోయిన శ్రమ పరాయి ఉత్పత్తులను పొందే అవసరాన్ని నిరంతరం పెంచుతుంటే ఆ సమాజానికి అంత ముంటుందా?

సోషలిస్టు దశగా పిలవబడే ఆ ఉత్పత్తి సంబంధాలు కేపిటలిజం పునరుద్దరణకు సరిపోయే సాంస్కృతికాభివృద్ధిని, చైతన్యాన్ని ఉత్పత్తి చేయవచ్చు అనే ఆలోచన సోషలిస్టు సూత్రానికి మోకరిల్లడంలో విస్మరించబడింది. 'క్యూబాలో మనిషి, సోషలిజం' గ్రంధంలో చేగువేరా హెచ్చరించినట్లుగా పాదార్థిక స్వార్థంపై ఆధారపడటం అనేది మూసుకుపోయిన దారి.

కాపిటలిజం మనకు వదిలిపెట్టిన మందకొడి సాధనాల సాయంతో సోషలిజం సాధిద్దామనే పగటికల ఒక (దారిలేని) గొడ్డుసందుకు చేర్చుతుంది. ఎక్కడ దారి తప్పామో కూడా

తెలియదు. సరుకు ఆర్థిక కణంగా ఉండటం, వైయక్తిక భౌతిక ప్రయోజనం ఉద్దీపనగా ఉండటం అనేవి మందకొడి సాధనాలు. నిజానికి నువ్వొకసారి భౌతిక ప్రయోజనం ఉద్దీపనగా అంగీకరించి ఆధారపడితే అన్ని సమస్యలకూ పరిష్కారం మరింతగా ఉద్దీపనలనుపయోగించడమే! ఈ దృక్పథం నుండి చూసినపుడు ఆర్థిక సమస్యలకు మూలం గోర్బచేవ్ వివరించినట్లుగా పనిని బట్టి పంపిణీ అనే సోషలిస్టు సూత్రాన్ని తీవ్రంగా ఉల్లంఘించడమే అయి తీరాలి. విషయం సుస్పష్టం. పాత సమాజం నుండి వారసత్వంగా పొందిన లోపాల పునాదులపై కొత్త సమాజాన్ని సృష్టించాలని ప్రయత్నిస్తే కొత్త సమాజాన్ని నిర్మించలేవు సరికదా పాత సమాజపు ఘటకాంశాలను బలపరుస్తావు. సమానమైన దాన్ని పొందే హక్కును (అసమానతా హక్కు) అమలు చేయాల్సిన సోషలిస్టు సూత్రంగా పెంచి చూపిస్తే , 'ప్రత్యేక సోషలిస్టు దశ' భావన 'ఒక ప్రక్రియగా సోషలిజం' నిర్మించాలనే భావనను వమ్ము చేస్తుంది.

## 'నిజమైన సోషలిజం' , సోవియట్ నమూనా

సోషలిజాన్ని గురించి మార్క్సు భావన నుండి సైద్ధాంతికంగా వైదొలగడాన్ని అర్థం చేసుకోవడం చాలా అవసరం. సోవియట్ తదితర తూర్పు యూరపు దేశాల నమూనా చాలా ఆకర్షణీయం అయ్యింది. ముఖ్యంగా బీద దేశాల్లో! సోవియట్ యూనియన్ లో ఉన్న విస్తార గ్రామీణ జనాభాకు రాజ్య నిర్దేశిత పెట్టుబడులతో పారిశ్రామిక పునాది నిర్మించి జీవన ప్రమాణాల్లో గణనీయమైన వృద్ధిని సాధించారు. బాహ్య శత్రువులను తట్టుకొని ఇదంతా సాధించారు. అయితే 1960ల ప్రారంభానికి ఆ నమూనాలోని లోపాలు స్పష్టం కాసాగాయి. అవి ఎంత స్పష్టంగా కనిపించాయంటే చేగువేరా సోవియట్ యూనియన్లో కాపిటలిజం పునరుద్ధరణ జరుగుతుందని జోస్యం చెప్పాడు.

నిరుద్యోగం, అసమానతలు, అభద్రతలను సృష్టించే ధోరణి అంతర్గతంగా కలిగి వుండే కాపిటలిజాన్ని సోవియట్ నమూనా స్పష్టంగా తిరస్కరించిందనేది నిర్వివాదాంశం. ఆ విధంగా 'నిజమైన సోషలిజం' యొక్క విలక్షణ ఉద్ఘాటనలు అందరికీ ఉద్యోగాలు, కార్మికులను పని నుండి తొలగించకుండా రక్షణ, నిత్యావసరాలపై రాయితీలు, ధరలు పెరగకుండా రక్షణ, భవిష్యత్తులో జీవన ప్రమాణాల పెంపుకు హామీ మొ.. అయ్యాయి. శ్రామికుల కిచ్చే ఈ స్పష్టమైన ప్రయోజనాలు ఒక 'సామాజిక ఒప్పందం'లో భాగం. దాని ప్రకారం అందుకు బదులుగా శ్రామికులు పార్టీ యొక్క మార్గదర్శకత్వాన్ని పనిస్థలంలోను, సమాజంలోను నిరభ్యంతరంగా అంగీకరించాలి.

అయితే ఈ ప్రయోజనాలు కలిగినప్పటికీ ఆ సామాజిక ఒప్పందం సంపద్వంత మానవుని అభివృద్ధిని అడ్డుకొంది. 'నిజమైన సోషలిజం' నమూనా ముఖ్య లక్షణం ఏమంటే సోషలిజాన్ని ఎలా నిర్మించాలో పార్టీకి / రాజ్యానికి మాత్రమే తెలుసు అనే గట్టి నమ్మకం. అది మాత్రమే (పార్టీ) సమగ్ర చిత్రాన్ని చూడగలదు కాబట్టి అదే నాయకత్వం వహించాలి. మార్గదర్శకత్వం లేకుంటే గందరగోళం ఏర్పడుతుంది. కార్మిక వర్గం తప్పులు చేయకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలనేది దీని దృక్పథం.

ఆ విధంగా పని చేసే చోట నిర్ణయాలు చేసేది పనివారు కాదు. 'వారికి పరాయిదైన మహాశక్తివంతమైన ఇచ్ఛ' ఎలా ఉత్పత్తి చేయాలో నిర్ణయిస్తుంది. అలాగే అక్కడ ఆలోచనకు ఆచరణకు మధ్య విభజన గాని, కాపిటలిస్టు శ్రమ విభజనకు వ్యక్తి విధేయునిగా ఉండటం గాని అంతం కాలేదు. శ్రామికుల సామర్థ్యాలు పెంచడానికి బదులు 'నిజమైన సోషలిజం' శ్రమ ప్రక్రియ యొక్క మేధోశక్తుల నుండి పరాయీకృతమైన, హీన పరచబడిన మానవ శకలాన్ని ఉత్పత్తి చేసింది. అంతేగాక పని స్థలంలోనూ, సమాజంలోనూ పరిస్థితులను మారుస్తూ తనూ మారేందుకు అనుమతించే పోటీని నిరుత్సాహ పరచడం జరిగింది. అధికార, సామాజిక సంస్థల ద్వారా తన నిర్ణయాలను క్రిందికి పంపడం ద్వారా పార్టీ రోజాలగ్జెంబర్గ్ చెప్పినట్లు "కార్మిక వర్గం తన సొంత తప్పులు చేయడానికి, చరిత్ర గతితర్కం నుండి నేర్చుకోవడానికీ" అవకాశం లేకుండా అడ్డుకొంది.

పార్టీ లేదా ప్రభుత్వం సమాజాన్ని సరియైన దారిలో నడిపించ గలిగినపుడు అటువంటి అనిశ్చితమైన దారినెందుకు ఎంచుకోవాలి? ఉత్పత్తి సాధనాలపై యాజమాన్యం చట్టబద్ధ రాజ్యానిదిగా వుంది. (ఇది సోషలిస్టు ఉత్పత్తి సంబంధాలతో సమానమన్నారు) అధికారిక సిద్ధాంతం ప్రకారం ఉత్పత్తి శక్తుల అభివృద్దే అతి ముఖ్య లక్ష్యం. తద్వారా సమృద్ధతా దశకు పయనించాలి. ఆ దశలో అవసరాన్ని బట్టి పంపిణీ, కోరిక లేదా

ఇచ్చును బట్టి పని. అతి సరళంగా చెప్పాలంటే పార్టీ మార్గ దర్శకత్వంలో పని పరిస్థితులు, పనివారు కూడా మారతారనేది 'నిజమైన సోషలిజం' ముఖ్య లక్షణానికి ప్రాతిపదికగా ఉంది.

అయితే 'థీసిస్ ఆన్ ఫోయర్ బాక్' లో మార్క్స్ తిరస్కరించింది కచ్చితంగా ఈ దృక్పధాన్నే! ప్రజల కొరకు పరిస్థితులను మార్చాలని ప్రతిపాదించే వారి గురించి ఆయనిలా వ్యాఖ్యానించాడు. "వారు మనుషులే పరిస్థితులను మారుస్తారని, బోధకుడు తనకు తాను విద్యావంతుడు కావాలని మరచి పోయారు. కనుక ఈ సిద్ధాంతం సమాజాన్ని రెండు భాగాలుగా విభజిస్తుంది. ఇందులో ఒక భాగం సమాజం కంటే ఉన్నతమైనది / శ్రేష్టమైనది."

'నిజమైన సోషలిజం' లో లోపించిందేమిటి? సోవియట్ నమూనాలో ఏం లోపించిందో స్పష్టమైన సూచనతో 1964 లో చేగువేరా క్యూబా గురించి వ్యాఖ్యానించాడు. "ప్రపంచంలో మొట్ట మొదటిసారిగా మేం ఒక మార్క్సిస్టు సోషలిస్టు వ్యవస్థను స్థాపించాం. అది సర్వసమానమైనది, లేదా యించుమించుగా సర్వ సమానమైనది. ఈ వ్యవస్థ మనిషిని కేంద్రం చేసి వ్యక్తి గురించి మాట్లాడుతుంది. అది మనిషి గురించి అతని ప్రాధాన్యత గురించి, అలానే విప్లవంలో అతి ముఖ్యాంశంగా అతని గురించి మాట్లాడుతుంది".

మానవాభివృద్ధి ఆచరణల మధ్య మార్క్స్ చెప్పిన కీలక లింకు – అంటే పరిస్థితులు, మానవ కార్యాచరణ లేదా స్వీయ మార్పు ఏక కాలంలో కలిసి జరగడాన్ని మరచిపోతే ఏమవుతుంది? 'నిజమైన సోషలిజం' లో లోపించింది పని స్థలం లోను, వాడలోనూ, మొత్తం సమాజంలోనూ కార్మిక వర్గ నాయకత్వం. ఫలితాన్ని ఊహించవచ్చు. పని స్థలంలో పరాయితనం, తక్కువ ఉత్పదకత, పరాయి ఉత్పత్తుల పట్ల కాంక్ష. 'నిజమైన సోషలిజం' కేవలం సంపద్వంత మానవులనుత్పత్తి చేయడంలో మాత్రమే విఫలం కాలేదు. దాని ద్వితీయ ఉత్పత్తి ఏమంటే కాపిటలిజం పునరుద్దరణను అడ్డుకొనే ఇచ్ఛ గాని, అందుకు తగ్గ శక్తి గాని లేని శ్రామిక వర్గం. ఆ దారి అంతటితో మూసుకు పోతుంది.

## పునరావిష్కరణా ? లేక పునరుద్దరణా ?

వెనుజులా అధ్యక్షుడు చావెజ్ ఆ దారిని వెళ్ళకూడదని నిర్ణయించుకున్నాడు. 'నిజమైన సోషలిజం' తో వేరు పడాలని వక్కాణించాడు. రాజ్య పెట్టుబడిదారీ విధానమంటూ సోవియట్ అనుభవాన్ని బహిరంగంగా తిరస్కరించాడు. 2005 జనవరి నెలలో ''మనం సోషలిజాన్ని తిరిగి కనుగొనాలి'' అని ప్రకటించాడు. ఆ తరువాత నెలల్లో ఆయన 21వ శతాబ్దానికి ప్రత్యేకమైన సోషలిజాన్ని కనుక్కోవాలని పిలుపు నిచ్చాడు. 'సోషలిజాన్ని ఒక వాదంగా, ఒక ప్రణాళికగా ఒక మార్గంగా మనం తిరిగి ప్రకటించాలి. అయితే ఇది కొత్త రకం సోషలిజం, మానవతావాద పూర్వకమైనది. ఇది యంత్రాలను, రాజ్యాన్ని కాక అన్నింటి కంటే మనుషులను ముందుంచాలి'. అని వక్కాణించాడు.

21వ శతాబ్దపు సోషలిజాన్ని గురించిన చావెజ్ వాదన లోని కేంద్ర విషయం మానవాభివృద్ధి, ఆచరణల మధ్య కీలక లింకు గురించిన ఉద్ఘాటనే! 2007 లో 'సోషలిస్టులను తయారు చేయాలి' అని చెబుతూ "విప్లవం కేవలం ఆహారం, వస్తువులు, సేవలను ఉత్పత్తి చేయడమే కాక వాటన్నింటి కంటే ముఖ్యంగా కొత్త మానవులను, కొత్త పురుషులను, కొత్త స్త్రీలను ఉత్పత్తి చేయాలి" అన్నాడు. ఉత్పత్తి శక్తులు, సోషలిస్టు మానవులు ఏకకాలంలో కలిసి అభివృద్ధి చెందాలని చేగువేరా చెప్పిన విషయాన్నంగీకరిస్తూ చావెజ్ దానికి ఏకైక మార్గం ఆచరణే నన్నాడు. మనం సోషలిజాన్ని ఆచరించాలి. అంటే ఆచరణలో సోషలిజాన్ని నిర్మించాలి. ఆ ఆచరణ మనల్ని సృష్టిస్తుంది, మనల్ని మారుస్తుంది. అలా కాకపోతే మరోలా మనం సాధించలేం.

చావెజ్ దృష్టిలో నాయకత్వ ప్రజాస్వామ్యమే దారి. పని స్థలంలోను, వాడలోను ఆచరణగా నాయకత్వ ప్రజాస్వామ్యం. అయితే ఇది కొత్తదేం కాదు. నిజానికి 21వ శతాబ్దపు సోషలిజం అంటే సోషలిజం గురించి మార్క్స్ అవగాహనకు వెనక్కు వెళ్ళడమే! ❑

**(ఎనలిటికల్ మంత్లీ రివ్యూ సెప్టెంబర్–అక్టోబర్ 2016)**

**కమ్యూనిజం ఫిబ్రవరి 2017**

RNI Regn No. 52879/93

1952
స్థాపితం

PMP

233374
✆ 233380
233381

PEOPLE'S MEDICAL PRODUCTS
ELURU

సుప్రసిద్ధ ఆయుర్వేద మందుల తయారీదారులు

| | |
|---|---|
| లిక్విడ్ సెడాన్సు | గర్భాశయ రోగనివారిణి |
| ధాతుకల్ప | ఆయుర్వేద వాజీకరణ ఔషధము |
| మిల్కోనాల్ | ఆయుర్వేద టానిక్ |
| జర్మ్‌కీలర్ | సమస్త చర్మవ్యాధి నివారిణి |
| చందన కల్ప | పూయమేహమునకు మంచి ఔషధము |
| కాఫ్‌రాల్ | దగ్గులకు ప్రత్యేక ఔషధము |
| ఎ.సి. కాంపౌండు | శ్వాసకోశ వ్యాధులకు, హృదయ వ్యాధులకు టానిక్ |
| శిశుజీవన్ | ఆయుర్వేద పిల్లల టానిక్ |

*పైన తెలిపిన మందులే కాకుండా వివిధ వ్యాధులకు సంబంధించి 18 రకాల లేహ్యములు, 15 రకాల తైలములు కూడా తయారు చేయబడును.*

మందులన్నియు ఆయుర్వేద శాస్త్రాలను అనుసరించి శాస్త్రీయ పద్ధతిలో తయారు చేయబడును

పీపుల్సు మెడికల్ ప్రొడక్ట్సు

D-2, ఇండస్ట్రియల్ ఎస్టేటు, ఏలూరు - 534 007

**JAATEEYA SPURTHI,** Fortnightly Printed and **Published by N. Venkateswara Rao**
at Godavari Printers, R.R.Pet, ELURU - 534 002. ✆ 9848 234228 **Chief Editor : DVVS Varma**